ప్రజాశక్తి
సోమవారం 10 జూన్ 2024 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

మళ్లీ అగ్రతాంబూలం!

- కళను సంతరించుకుంటున్న అమరావతి రాజధాని
- ఉన్నతాధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులకు శ్రీకారం
- అసంపూర్తిగా ఉన్న భవననిర్మాణాల పూర్తికి ప్రాధాన్యం
- రాజధాని గ్రామాల్లో సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ పర్యటన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి :

ఐదేళ్ల తరువాత రాజధాని గ్రామాలకు మళ్లీ జీవం వచ్చింది. గ్రామాల్లో రాజధాని కళ సంతరించుకుంటోంది. 2019 మేనెల వరకు కళకళలాడిన గ్రామాలన్నీ వైసిపి అధికారంలోకి రావడంతో కళ తప్పాయి. ఎటువంటి కార్యకలాపాలూ లేక వెలవెలబోయాయి. 2019 డిసెంబరు 17న అసెంబ్లీలో అప్పటి సిఎం జగన్ మూడు రాజధానుల బిల్లు ప్రవేశపెట్టడంతో రాజధాని గ్రామాల్లో కలకలం చెలరేగింది. నిర్మాణ సంస్థలన్నీ వెనుదిరిగాయి. ఎక్కడిపనులు అక్కడ

2లో



ఉద్దండరాయునిపాలెంలో రాజధాని నమూనాను పరిశీలిస్తున్న సిఎం నీరబ్‌కుమార్ ప్రసాద్ తదితరులు



రాజధాని ప్రాంతం కృష్ణాయపాలెంలో ధ్వంసం చేసిన శిలాఫలకం



కేంద్ర సహాయ మంత్రిగా చంద్రశేఖర్

- తొలి అడుగులోనే అమాత్యునిగా ప్రమాణస్వీకారం
- టిడిపి నేతలు, కార్యకర్తల్లో ఆనందోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

కేంద్ర సహాయ మంత్రిగా గుంటూరు ఎంపి పెమ్మసాని చంద్రశేఖర్ ఆదివారం రాత్రి ఢిల్లీనిలోని రాష్ట్రపతి భవన్‌లో ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన ఆంగ్లంలో ప్రమాణం చేశారు. అనంతరం నరేంద్ర మోడీ, టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా

2లో

వైసిపి పాలనలోని శిలాఫలకాలు ధ్వంసం

పేర్లు మారుస్తున్న టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి/మంగళగిరి రూరల్

టిడిపి హయాంలో ఏర్పాటు చేసిన నిర్మాణాలను తొలగించడం, పేర్లు మార్చడం వంటి చర్యలకు పాల్పడిన వైసిపి నాయకుల బాటలోనే తాజాగా టిడిపి నాయకులు కూడా పయనిస్తున్నారు. రాజధాని ప్రాంతమైన మంగళగిరి మండలం కృష్ణాయపాలెంలో మాజీ సిఎం జగన్ గతేడాది మేలో రాజధాని గ్రామాల్లో పేదలకు 54 వేల ఇళ్ల స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మాణానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసిన విషయం ఆదివారం వెలుగుచూసింది. అమరావతి ప్రాంతంలో జగన్ పేదలకు సెంటు స్థలాలను కేటాయించిన సమయంలో కష్ణాయపాలెం శివారులో శంకుస్థాపన చేసి నమూనా ఇంటితో పాటు, స్తూపాన్ని ఏర్పాటు చేశారు. అయితే కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఏర్పాటు చేసిన స్తూపాన్ని, శిలాఫలకాన్ని జేసీబీతో ధ్వంసం చేశారు. ఈ ఘటనపై వైసిపి నాయకులు తీవ్రంగా మండిపడుతున్నారు. ఇదిలా ఉండగా గుంటూరులో ఎన్‌టిఆర్ స్టేడియంలో ఎన్నికల షెడ్యూలు వెలువడటానికి ముందు ఏర్పాటు చేసిన జిమ్ కేంద్రాన్ని వైసిపి ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. ఇందుకు సంబంధించిన శిలాఫలకాలను టిడిపి నాయకులు సిరివరపు శ్రీధర్, రావిపాటి సాయికృష్ణ తదితరులు ఆదివారం ధ్వంసం చేశారు. శిలాఫలాకాలను తొలగించి జిఎం సెంటర్‌కు ఎన్‌టిఆర్ జిమ్ సెంటర్ అని పేరు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ స్టేడియంలో వైఎస్ పేరుతో జిమ్ ఏర్పాటును ఖండించారు.

రెంటచింతలలో డయేరియా - ఒకరు మృతి
వార్త మెయిన్‌లో

కాల్వల్లో నీరు పారే దారి కావలెను!



కోతలకు గురైన తుంగభద్ర కాల్వకట్ట

- చిట్టడవులను తలపిస్తున్న పంట కాల్వలు
- ఇసుక, మట్టి మేటలు, కోతలకు గురైన కట్టలు
- శిథిలావస్థలో లాకులు - ప్రతిపాదనల్లోనే మరమ్మతులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

150 ఏళ్ల చరిత్ర కలిగిన డెల్టా ఐదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. డెల్టా సాగుకు ప్రధానమైన నీటిపారుదల వ్యవస్థ పూర్తిగా విస్మరించబడింది. కాల్వకు కనీస మరమ్మతులు, పూడిక తీతలైనా లేక నీరు పారే దారి కనుమరుగైంది. మరమ్మతుల కోసం జల వనరుల శాఖాధికార్లు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం, అవి విస్మరణకు గురవడం కొన్నేళ్లుగా రివాజుగా మారింది. దుగ్గిరాల సెంటర్ సబ్ డివిజన్ పరిధిలో ఉండే తాడేపల్లి నుండి నిజాంపట్నం వరకు కాల్వల మరమ్మతుల కోసం గతేడాది రూ.కోటిన్నరతో అధికారులు పంపిన ప్రతిపాదనలు కార్యరూపం ద్చాలేదు. కొన్ని చిన్నాచితక పనులు చేపట్టినా వాటికి బిల్లులు సకాలంలో మంజూరవ్వక కాంట్రాక్టర్లూ ఇతర పనులకు టెండర్లు వేయడానికైనా ముందుకు రాలేదు. వెరసి డెల్టాలో సాగునీరు ప్రశ్నార్థకంగా మారింది. తాజాగా ఖరీఫ్ సాగు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇప్పుడైనా పరిస్థితిలో మార్పు వస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

5.71 లక్షల ఎకరాల ఆయకట్టు కలిగిన కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాల్వ దుగ్గిరాలలోని బకింగ్ హామ్ కెనాల్ వద్ద ఆరు కాల్వలుగా చీలిపోతుంది. కొమ్మమూరు కాల్వ (తుంగభద్ర మద్రాసు కాల్వ) పరిధిలో సుమారు 2.64 లక్షల ఎకరాలు, నిజాంపట్నం తూర్పు పశ్చిమ పడవల కాల్వ పరిధిలో 1.52 లక్షల ఎకరాలు, బ్యాంక్ కెనాల్

2లో



అడవిని తలపిస్తున్న ఈమని, చింతలపూడి పంట కాల్వలు



ఇసుక మేట వేసిన కొమ్మమూరు కాల్వ

కాల్వల్లో నీరు పారే దారి కావలెను!

(మొదటి పేజీ తరువాయి)

పరిధిలో 1.55 లక్షల ఎకరాలు సాగవుతున్నాయి. దీంతోపాటు ఈ కాల్వల నుండి అనేక ఇతర పంట కాల్వలకూ నీరెళ్లి పొలాలను తడపాల్సి ఉంది. డెల్టా చివరి భూములకు సకాలంలో నీరందాలంటే కాల్వల్లో అడ్డంకులు లేకుండా నీరు సజావుగా పారితేనే సాధ్యమవుతుంది. అయితే ప్రస్తుతం కాల్వలతోపాటు వాటి కట్టలు రూపు మార్చుకున్నాయి. పలుచోట్ల కాల్వ కట్టలు నీటి కోతలకు గురై బలహీనపడ్డాయి. కాల్వల్లో ఏళ్ల తరబడి పూడికలు తీయని కారణంగా ఇసుక, మట్టి మేటలు వేశాయి. గుర్రపు, కంప చెట్లు పెరిగి అనేక చోట్ల కాల్వలు చిట్టడవులను తలపిస్తున్నాయి. దుగ్గిరాల, రేంవేంద్రపాడుతోపాటు ఇతరచోట్ల ఉన్న లాకులు సైతం శిథిలావస్థకు చేరాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో పొలాలకు నీరందడం, పైరును బతికించుకుని మంచి దిగుబడి పొందడం రైతుకు దినదిన గండంగా మారింది. హైలెవల్ ఛానల్ కింద సాగయ్యే పెనుమూలి, కంఠంరాజుకొండూరు తదితర గ్రామాల్లో గతేడాది సాగునీరు సరిగా అందలేదు. ఎకరాకు రూ.5-10 వేల వరకూ రైతులు అదనంగా ఖర్చుచేసి ఇంజన్ల ద్వారా పొలాలను తడపాల్సి వచ్చింది.

గతేడాది జూన్ 6న పంట కాల్వలకు సాగునీటిని విడుదల చేశారు. ఈ ఏడాది ఎన్నికల నేపథ్యం, కొత్త ప్రభుత్వం ఇంకా కొలువుదీరకపోవడం తదితర కారణాలతో నీటి విడుదల లేకపోవడం ఒకెత్తయితే పంట కాల్వల మరమ్మతులు అసలే లేవు. మరోవైపు వర్షాలు కురుస్తుండడంతో రైతులు తమ పొలాలను దున్ని సాగుకు సిద్ధం చేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో ప్రధాన పంట వరి కాగా మెట్ట పంటలైన పసుపు, అరటి, ఆకు కూరలు తదితర పంటలూ సాగవుతుంటాయి. ఈ పైర్లన్నీ బతికాలన్నా, రైతు చేతికి పంట దక్కాలన్నా సకాలంలో నీటి విడుదల, అవి సజావుగా పారడానికి కాల్వల మరమ్మతులు అత్యవసరం. ఆ దిశగా నూతన ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

స్టార్టప్ కంపెనీ ప్రారంభించాలి

ఎం.సాయియశ్వంత్‌రెడ్డి, ఓపెన్ కేటగిరీలో 50వ ర్యాంకర్, భాష్యం ఐఐటి, జెఇఇ అకాడమీ, గుంటూరు.

ప్రజాశక్తి-గుంటూరు

ఐఐటి ముంబాయిలో సిఎస్‌సి చేసి, సబ్జెక్టులపై మంచి పట్టు సాధించాలని, స్టార్టప్ ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. తల్లి సొంతూరు కర్నూలు జిల్లా. అరుణ గృహిణి. రామేశ్వరరెడ్డి స్కూల్ బ్యాగ్‌లు తయారు చేస్తారు. కళాశాలలో నిర్వహించిన వివిధ రకాల ఫరీక్షలు, అధ్యాపకుల శిక్షణ జేఈఈలో ఉత్తమ ఫలితాలకు దోహదం చేశాయి. ఎక్కడ తప్పులు చేస్తున్నామో తెలుసుకొని, అధ్యాపకుల సూచనలతో వాటిని అధిగమించే వాడిని... అని తన లక్ష్యాన్ని పంచుకున్నారు.



మళ్లీ అగ్రతాంబూలం!

(మొదటి పేజీ తరువాయి)

ఆగిపోయాయి. ఒక్కసారి అయోమయం సంతరించుకుంది. రైతులు ఉద్యమ బాటపట్టారు.1630 రోజులపాటు ఉద్యమం కొనసాగించారు. ఐదేళ్ల తరువాత ఎట్టకేలకు ప్రభుత్వం మారింది. అమరావతి అభివృద్ధిలో కదలిక వచ్చింది. సిఎంగా చంద్రబాబు నాయుడు ఇంకా ప్రమాణ స్వీకారం చేయకుండానే ఆయన మౌఖిక ఆదేశాలతో అధికారులు రాజధాని గ్రామాలకు తరలి వస్తున్నారు. ఏకంగా రాజధానిగ్రామాల్లో ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సిఆర్డిఏ అధికారులతో కలిసి పర్యటించారు. ఈనెల 12న కొత్త ప్రభుత్వం కొలువు దీరనున్న నేపథ్యంలో సిఎస్ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది.

గత చంద్రబాబు ప్రభుత్వం అమరావతి రాజధానిని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టగా గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ఐదేళ్ళుగా రాజధాని ప్రాంతంలో నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. ప్రస్తుతం ఆ పనులన్నీ శరవేగంగా పున:ప్రారంభం అయ్యేందుకు అవకాశం ఉన్నందున సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఛార్జి తీసుకున్న రెండు రోజుల్లోనే రాజధాని ప్రాంతంలో పర్యటించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అమరావతి రాజధాని నిర్మాణాన్ని వేగవంతం చేసేందుకు ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది.ఇప్పటికే గత నాలుగైదు రోజులుగా రాజధాని ప్రాంతంలో 83 జెసిబిలు, టిప్పర్లు వంటి యంత్రాలతో రాజధాని శంఖు స్థాపన ప్రాంతంలోను, సీడ్ యాక్సిస్ రహదారి, కరకట్ట రహదారి సహా ఇతర మాస్టర్ ప్లాన్ లోని ప్రధాన రహదారులు వెంబడి చిన్న చిన్న మరమ్మత్తులు నిర్వహించడం, తుప్పలు తొలగించడం, విద్యుత్ దీపాల పునరుద్ధరణ వంటి పనులను సిఆర్డిఏ అధికారులు చేపట్టారు. సిఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారిగా రాజధానిగ్రామాల్లో పర్యటిస్తారని అధికారులు భావిస్తున్నారు.



ఈ నెల మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గ్రామాల్లో అభివృద్ధి పనులపై మళ్లీ ఒక ప్రణాళికను విడుదల చేస్తారని తెలిసింది. గతంలో 2015లో అమరావతి రాజధానికి శంకుస్థాపన జరిగిన సమయంలో ప్రస్తుత సిఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ రాష్ట్ర మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖ కమిషనర్‌గా ఉండడంతో ఆయనకు రాజధాని నిర్మాణానికి సంబంధించిన పనులపై పూర్తి అవగాహన ఉంది. సిఎస్ పర్యటనలో భాగంగా రాజధాని ప్రాంతంలో అసంపూర్తి నిర్మాణ పనులతో మధ్యలో ఆగిపోయిన వివిధ భవన నిర్మాణాలను పరిశీలించారు. ముందుగా రాజధాని ప్రాంతానికి సంబంధించి గతంలో భూమిపూజ జరిగిన ఉద్దండరాయునిపాలెంలోని సిఆర్‌డిఎ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించారు. అఖిల భారత సర్వీసు అధికారుల నివాసం సముదాయ భవనాలను, ఎమ్మెల్యేల క్వార్టర్లు, ఎపి ఎన్జిఓ ఉద్యోగుల నివాస భవన సముదాయాలను పరిశీలించారు. 10 ఎంఎల్డి వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, హేపీనెస్ట్ వంటి నిర్మాణాలను పరిశీలించారు.

ఇప్పటికే కార్యకలాపాలు నిర్వహిస్తున్న హైకోర్టు అదనపు భవన సముదాయాన్నీ సిఎస్ పరిశీలించారు. నూతన ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే అమరావతి రాజధాని ప్రాంతంలో పనులను శరవేగంగా ఏ విధంగా ముందుకు తీసుకువెళ్లాలనే దానిపై సిఆర్‌డిఎ అధికారులతో చర్చించారు.

కేంద్ర సహాయ మంత్రిగా చంద్రశేఖర్

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు నాయుడులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం డాక్టర్ పెమ్మసాని స్పందిస్తూ తనకు అప్పగించిన బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. పెమ్మసాని ప్రమాణస్వీకారం సందర్భంగా టిడిపి కార్యాలయాల వద్ద బాణసంచా కాల్చి కార్యకర్తలు, నాయకులు ఆనందం వ్యక్తం చేశారు. దాదాపు 50 ఏళ్ల తరువాత గుంటూరు ఎంపికి కేంద్రమంత్రి పదవి దక్కింది. గతంలో ఉమ్మడి జిల్లా నుంచి కేంద్ర మంత్రులుగా ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, దగ్గుబాటి పురంద్రీశ్వరి, పనబాక లక్ష్మీ, జెడి శీలం పనిచేశారు. దాదాపు 10 ఏళ్ల తరువాత ఉమ్మడి జిల్లాకు కేంద్ర మంత్రి పదవి దక్కింది. ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి నరసరావుపేట ఎంపి లావు శ్రీకృష్ణదేవరాయులు, జిల్లాకు చెందిన పలువురు టిడిపి ఎమ్మెల్యేలు హాజరయ్యారు. అనూహ్యంగా అందలం ఎక్కిన చంద్రశేఖర్ తెనాలి మండలం జిల్లాలోని బుర్రిపాలెం గ్రామంలో 1976 మార్చి 7న జన్మించిన పెమ్మసాని చంద్రశేఖర్ ఉస్మానియా యూనివర్సిటీలో ఎంబీబీఎస్ చదివారు. అమెరికాలోని జాన్స్ హాప్కిన్స్ యూనివర్శిటీ-సినాయ్ హాస్పిటల్‌లో ఐదేళ్లపాటు వైద్యుడిగా కూడా పనిచేశాడు. ప్రపంచ వ్యాప్తంగా జయప్రదంగా వ్యాపారం నిర్వహిస్తున్న వ్యాపారవేత్తలకు అమెరికాలో ప్రసిద్ధి చెందిన ఫోర్బ్స్ సంస్థ అవార్డులను అందిస్తుంది. ఫోర్బ్స్ నుండి ఆయన 2020 సంవత్సరంలో ప్రతిష్టాత్మక 'ఎర్నేస్ట్ ఎంటర్ప్రెన్యూర్' అవార్డును అందుకున్నారు. అమెరికాలోని అనేక ప్రతిష్టాత్మక మీడియా సంస్థలైన మీడియం, సీఈఓ వరల్డ్, ఫాస్ట్ మాగజైన్లు కూడా అవార్డులు అందించాయి. ఎఎస్‌యు, జిఎస్‌వి సమ్మిట్ నుండి ఆయన సన్మానం అందుకున్నారు. ప్రస్తుతం ఆయన సేవలను దృష్టిలో ఉంచుకోని సదరు సంస్థలు ఆయనకు తమ సభ్యత్వాన్ని ఇచ్చాయి. భారతీయ మూలాలు కలిగిన అమెరికా ఫిజిషియన్ అసోసియేషన్‌లో సైతం ఆయన సభ్యుడుగా ఉన్నారు.

ఉచిత వైద్య సేవలు : వైద్య బీమా లేక అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న ప్రవాస భారతీయులకు అమెరికా దేశంలోని డల్లాస్ నగరంలో పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించారు. నాటి ఉమ్మడి గుంటూరు జిల్లా పల్నాడు ప్రాంతంలో ప్రజల తాగునీటి ఇబ్బందులు తీర్చేందుకు 2010 నుండి సుమారు 100 వరకు ఉచిత బోర్ వెల్స్ ఏర్పాటు, ఆర్వో ప్లాంట్‌లు ఏర్పాటు, ఓవర్ ట్యాంకుల నిర్మాణం, తాగునీటి ట్యాంకర్లు సరఫరా చేస్తున్నారు. తన స్వగ్రామమైన బుర్రిపాలెంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం నిమిత్తం భూమిని ఉచితంగా అందించారు. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు చదువుల నిమిత్తం ఆర్థిక సాయం అందజేస్తున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద విద్యా సేవలు అందిస్తున్న సంస్థలకు ఇతోదిక విరాళాలను అందిస్తున్నారు. అంతర్జాతీయ సంక్షోభాల సమయంలో సైతం వారు పలు సంస్థలకు తమ ఆర్థిక తోడ్పాటును అందించారు. 2010 నుండి టిడిపి ఎన్ఆర్ఐ విభాగం తరపున పనిచేస్తూ తన విరాళంతోపాటుగా, ప్రవాసాంధ్రులు నుండి కూడా విరాళాలు సేకరించారు. పెమ్మసాని ఫౌండేషన్ ద్వారా నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలను పాదయాత్ర సమయంలో చూసిన చంద్రబాబు.. డాక్టర్ చంద్రశేఖర్‌ను రాజ కీయాల్లోకి ఆహ్వానించారు. 2014లో నరసరావుపేట పార్లమెంట్ స్థానం నుంచి టిడిపి అభ్యర్థిగా ఆయన పేరు ఖరారైనా చివరి దశలో నెలకొన్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో నాటి మాజీ ఎంపి రాయపాటి సాంబశివరావుకు టికెట్టు కేటాయించారు. 2019లోనూ చంద్రశేఖర్ నరసరావుపేట టిక్కెట్ కోసం ప్రయత్నించినా చివరికి ఇటీవల ఎన్నికల్లో గుంటూరు ఎంపి టిక్కెట్ దక్కింది. వైపిపి అభ్యర్థి కిలారి రోశయ్యపై 3,44,695 ఓట్ల ఆధిక్యతో చంద్రశేఖర్ భారీ విజయం సాధించారు.

సిఎం ప్రమాణ స్వీకారానికి పటిష్ట ఏర్పాట్లు

ప్రజాశక్తి-గన్నవరం

ఈ నెల 12వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలోని ఐటి పార్కు మేధా టవర్స్ సమీపంలో సిఎం ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు, శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు రానున్నారని, అందుకు తగిన విధంగా ఏర్పాట్లను పూర్తి చేయాలని చెప్పారు. ప్రధాన సభాస్థలి వెనుక భాగంలోని



గుంతలను పూడ్చి విఐపిలు వచ్చేందుకు వీలుగా చదును చేసే పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. వేదిక వద్ద, భారీకేడింగ్, బ్లాక్‌ల విభజన వంటి ఏర్పాట్లు చేయాలని సూచించారు. అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమం వీక్షించేందుకు వీలుగా సభ ప్రాంగణంతో పాటు వెలుపల ఎంపిక చేసిన ప్రదేశాల్లో ఎల్ఈడి స్క్రీన్‌లను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎమ్మెల్యేలు, కేంద్ర మంత్రులు, రాజకీయ ప్రముఖులు, సాధారణ పౌరులకు వివిధ ప్రదేశాల్లో ఎంపిక చేసిన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. గన్నవరం జాతీయ రహదారి పక్కన గల పెట్రోల్ బంక్, ఎన్టీఆర్ ప్రభుత్వ పశు వైద్య కళాశాల, కేసరపల్లి ముస్తాబాద్ రోడ్డు సమీపంలో రెండు చోట్ల పార్కింగ్ స్థలాలు, ఎలిట్ విస్టాస్, మేధా టవర్స్, ఇతర లేఔట్లలో ఎంపిక చేసిన పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. పార్కింగ్ ప్రదేశాల నుండి ప్రధాన సభకు చేరుకునేందుకు వీలుగా అప్రోచ్ రహదారులను నిర్మించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిజిపి హరీష్ కుమార్ గుప్తా, కార్యక్రమ ప్రత్యేక అధికారులు ప్రద్యుమ్న, బాబు.ఎ, వీర పాండ్యన్, వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్, అదనపు డీజీపి బాగ్చి, ఐజిలు రాజశేఖర్‌బాబు, అశోక్‌కుమార్, పోలీస్ కమిషనర్ రామకృష్ణ, కృష్ణాజిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పి అద్నాన్ నయీం అస్మి, కృష్ణా, గుంటూరు జిల్లాల జాయింట్ కలెక్టర్లు గీతాంజలి శర్మ, జి.రాజకుమారి, విజయవాడ, రాజమండ్రి మునిసిపల్ కమిషనర్లు స్వప్నిల్ దినకర్, దినేష్ కుమార్, డిఐజి గోపీనాథ్ జెట్టి, విజయవాడ డిసిపి అధిరాజ్ పాల్గొన్నారు.

రైతులు.. ఆకట్టుకునే ప్రకటనలతో మోసపోవద్దు

- నకిలీ విత్తనాలు, ఎరువులతో జాగ్రత్త
- ఎరువులు,విత్తనాల కొనుగోలులో అప్రమత్తత అవసరం
- వ్యవసాయ శాఖాధికారులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గత ఏడాది మిగిల్చిన నష్టాలను కష్టాలను దిగమింగి, ఆశల తొలకరి సాగుకు రైతులు సన్నద్ధం అవుతున్నారు. అన్నదాతలు విత్తనాలు, ఎరువులు సమకూర్చుకునే సమయం ఆసన్నమైంది. నకిలీ విత్తనాలు, ఎరువులతో కొన్ని ప్రైవేటు విత్తన కంపెనీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని ఈ తరుణంలో విత్తన ఎరువుల కొనుగోలులో రైతులు మెలకువలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఆకర్షణీయ ప్రకటనలతో, ప్రచార ఆర్భాటాలతో రైతులను ఏమార్చుతున్నాయి. కొందరు ఏకంగా డీలర్లకు ప్యాకేజీలు, విదేశీ టూర్లు సైతం ఆఫర్లు చేస్తున్నారు. రైతులను ఆకట్టుకునేలా విలాసవంతమైన వాహనాలలో వచ్చి కరపత్రాలు, వాల్‌పోస్టర్లతో ప్రచార వాహనాల ద్వారా గ్రామీణ ప్రాంతాలలో ప్రచారం చేస్తున్నారు. ఇప్పటికే నకిలీ విత్తనాలు మార్కెట్ లోకి రాకుండా వ్యవసాయ శాఖ అధికారులు అన్ని విధాలా తనిఖీలు చేస్తున్నారు. ఈ తరుణంలో రైతులు మోసపోకుండా అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

విత్తనాలు ఎరువుల కొనుగోలు సమయంలో జాగ్రత్తగా పరిశీలించాలని కంపెనీల ప్రకటనలు, ప్రచారాలకు ఆకర్షితులై విత్తనాలు కొనుగోలు చేస్తే మోసపోయే అవకాశముంది. ఆకర్షనీయమైన ప్యాకింగ్ చేసి గుర్తింపు లేని లేబుల్ తో కొన్ని కంపెనీలు నకిలీ విత్తనాలను రైతులకు అంటగడుతున్నాయి. కంపెనీల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. అన్నీ సరిచూసుకున్న తర్వాతే కొనుగోలు చేయాలి. ప్రభుత్వ నిబంధనల వివరాలు ఉన్నాయో లేవో జాగ్రత్తగా పరిశీలించాలి.



దెబ్బ తిన్న మిర్చి పొలాలను పరిశీలిస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు (ఫైల్ ఫొటో)

విత్తనాల ఎంపిక ఇలా..

వ్యవసాయశాఖ లైసెన్సులు పొందిన అధీకృత డీలర్ల నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలి. బిల్లుపై విక్రయదారుని పేరు, కేంద్ర, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబర్, రైతు పేరు, గ్రామం పేరు, విక్రయదారుని సంతకం, తేదీలు, రకం పేరు, బ్యాచ్ నంబర్, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు సరి చూసుకోవాలి. లూజుగా ఉన్న సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలు కొనరాదు. విత్తన ప్యాకెట్ సీసా, సంచి, డబ్బాలపై సీలు ఉందో లేదా నిర్ధారించుకోవాలి. కొనుగోలు చేసిన సరుకును డీలర్ వద్దే తూకం వేయించాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకూ భద్రపరచాలి.

మొలకెత్తే, పూత దశలో ఉన్నప్పుడు పంటలో లోపం కనిస్తే వెంటనే వ్యవసాయ శాఖ అధికారిని సంప్రదించాలి.

ఎరువులు కొనాలంటే ఇలా ..

ఈ పాస్ ద్వారా ఎరువులు కొనుగోలు చేయడం ద్వారా నకిలీ ఎరువులు గుర్తించే అవకాశం ఉంటుంది.అధీకృత డీలర్ల నుంచే ఎరువులు కొనుగోలు చేయాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులనే తీసుకోవాలి. కంపెనీ సీలు ఉందో లేదో గమనించాలి. ఒకవేళ చేతికుట్టు ఉంటే అటువంటి ఎరువులను కొనుగోలు చేయొద్దు.ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి చేసిన సంస్థ, ఉత్పత్తిదారు పేరు ఉంటేనే కొనాలి. చిల్లులు పడిన ఎరువుల బస్తాలను కొనవద్దు. ఇతర పదార్థాలు కలిస్తే ఆ ఎరువు కల్తీదిగా గుర్తించాలి. కొనుగోలు సమయంలో ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షలకు పంపించాలి.



పురుగు మందుల దుకాణంలో నిల్వలు, రికార్డులు పరిశీలిస్తున్న ఎడిఎ పి.మస్తానమ్మ, నరసరావుపేట మండల వ్యవసాయ శాఖ అధికారి వి.నరేంద్ర బాబు (ఫైల్ ఫొటో)

పురుగు మందులు కొనేముందు ఇలా...

వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగు మందులు కొనుగోలు చేయాలి. పురుగుమందు డబ్బాలపై డైమండ్ ఆకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విష పూరితమైతే ఎరుపు రంగు, విష పూరితమైతే నీలంరంగు, స్వల్ప విషపూరిత మైతే ఆకు పచ్చ రంగు గుర్తులు ఉంటాయి.పురుగు మందుల రకాలను కలిపి వాడరాదు. వాడిన డబ్బా లను, సీసాలను ధ్వంసం చేసి గోతిలో పూడ్చిపెట్టాలి. పురుగుమందుల వాడకానికి వినియోగించే పాత్రలను ఇతర అవసరాలకు వినియోగించవద్దు.

దళారులను నమ్మొద్దు

ఐ. మురళి.. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి



ప్రభుత్వ లైసెన్సు కలిగిన డీలర్ల వద్దే నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేయాలి. కొన్న విత్తనాల రసీదు లను రైతుల వద్ద భద్రపర్చుకోవాలి. నకిలీ విత్తనాలు కొని మోసపోవద్దు. దళారు లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మ వద్దు. ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే అధికారులను సంప్ర దించాలి. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఎడిఎ పి.మస్తానమ్మ

విత్తన అధీకృత వ్యాపారులు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని నరసరావుపేట వ్యవసాయ శాఖ ఏడిఏ పి.మస్తానమ్మ హెచ్చరించారు. పట్టణం లోని విత్తన ఎరువుల దుకాణాల నుండి విత్తనాలు, పురుగు మందులు నమూనాలు సేకరించి పరీక్షకు పంపించినట్లు చెప్పారు. విత్తన పరీక్షలో ఎటువంటి తేడాలు వచ్చినా , విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.



ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి-దుగ్గిరాల

మండలంలోని చింతలపూడిలో ఉన్న ప్రియదర్శిని ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థి కారుమూరి వంశీకష్ణ(24)ఆదివారం ఉదయం ఆత్మహత్యకు పాటుపడినట్లు స్థానిక పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం బాపట్ల జిల్లా పర్చూరు మండలం రమణాయపాలెం గ్రామానికి చెందిన వంశీకృష్ణకు బీటెక్ నాలుగో సంవత్సరం పూర్తి అయింది. అయితే, గత నాలుగేళ్లకు సంబంధించిన సబ్జెక్టులు ఇంకా మిగిలి ఉన్నాయి. దీంతో మిగిలిన సబ్జెక్టులు పూర్తి చేయడానికి పరీక్ష రాసే నిమిత్తం రెండు రోజుల క్రితం ఇక్కడికి వచ్చి స్నేహితులు కలిసి హాస్టల్‌లో ఉన్నట్లు తెలిపారు. చాలా సబ్జెక్టులు మిగిలి ఉండటంతో మనస్థాపం చెందిన అతను, కాలేజీ వెనుక భాగాన పొలాల్లో ఉన్న పాకలో ఉరి వేసుకుని మృతి చెందాడు. వంశీకృష్ణ మృతదేహాన్ని తెనాలి ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం చేయించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎఎస్ఐ అబ్దుల్ సత్తార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి

చుండూరి వెంకటేశ్వర్లు రాజీనామా

ప్రజాశక్తి-ఈపూరు

ఈపూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు చుండూరి వెంకటేశ్వర్లు వాట్సప్ ద్వారా సందేశం పంపినట్లు మార్కెట్ యార్డ్ కార్యదర్శి సూరే శ్రీనివాసరావు తెలిపారు.ఈపూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గా చుండూరి వెంక టేశ్వర్లు పదవీకాలం మే 10 తో ముగిసింది. చైర్మన్ పదవీ కాలం ఒక సంవత్సరం మాత్రమే. మరో ఏడాది పొడిగించే అవకాశం ఉంటుంది. అయితే, ఎన్నికల కోడ్ కారణంగా చైర్మన్ పదవి కాలం పొడగింపు ఆగిపోయింది. ఎన్నికల అనంతరం విదే శాలకు వెళ్లిన ఆయన, ఎన్నికలలో వైసిపి పరాజయం చెంద డంతో తన పదవికి రాజీనామాను ఆమోదించాలని కార్యదర్శికి సందేశం పంపారు.

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం

- రసాయన ఎరువుల వినియోగం తగ్గించేందుకు కృషి
- జిల్లాలో 52 వేల ఎకరాల్లో సాగు
- డిపిఎం అమల కుమారి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నవధాన్యాల సాగుతో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. శాఖ ఆధ్వర్యంలో ప్రకతి వ్యవసాయం వైపు రైతులను చైతన్య పరుస్తున్నారు. రసాయన ఎరువులు అధికంగా వినియోగంచడం వల్ల భూములు సారం కోల్పోయి భూమిలోని సూక్ష్మ పోషకాలు అంతరించి పోతున్నాయి. దీంతో భూసారం పెంచుకోవాల్సిన బాధ్యత అన్నదాతలపై ఉందని ప్రకృతి వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. రేపటి తరానికి సారవంతమైన భూములు అందించాలనే లక్ష్యంతో ప్రకతి వ్యవసాయం గురించి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ, రైతులను ప్రోత్సహిస్తున్నారు. ఖరీఫ్ అనంతరం ఖాళీగా ఉన్న పంట చేలల్లో పచ్చిరొట్ట బదులు నవధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలోని 28 మండలాల్లో 52 వేల ఎకరాల్లో నవధాన్యాల సాగు చేయించాలని లక్ష్యంగా పెట్టుకుని లక్ష్యం పూర్తి చేశాం. మండలాలలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఇప్పటికే రైతుల నుంచి ఆమోదం తీసుకుని విత్తన గుళికలు తయారు చేసి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మొక్కజన్న, జొన్న, మినుములు, పెసలు, ఉలవలు, జీలుగు, జనుము, గోంగూర, తోటకూర, కొత్తిమీర, బీర, ఆనప, ఊదలు, కొర్రలు, తదితర మొత్తం 30 రకాల విత్తనాలను నవధాన్యాలుగా పంటపొలాల్లో చల్లుతారు. 12 కిలోల విత్తన గుళికలను బంక మట్టితో కలిపి చల్లి, ఘన జీవామృతం పిచికారీ చేస్తారు. విత్తనాలను బంకమట్టితో కలిపి గుళికల రూపంలో వేయడం వల్ల పక్షులు తినవు చీడ పీడల ఆశించే వీలుండదు. దీంతో చల్లిన ప్రతి గింజా మొలకెత్తుతుంది.

పశు గ్రాసం కొరతను అధిగమిస్తున్న నవధాన్యాల సాగు

40 నుంచి 45 రోజుల పాటు ఏపుగా ఎదిగే నవధాన్యాలపై పంటను కోసం పశువులకు మేతగా ఉప యోగించుకోవడం ద్వారా పశు గ్రాసం కొరత అధిగమించడం వలన పాడి బాగా అభివృద్ధి చెందడంతో పాటు పశువు ఆరోగ్యం బాగుంటుంది. పంటను పశువులకు వినియోగించగా భూమి లోపల మిగిలిన దుబ్బులను ట్రాక్టర్తో కలియ దున్నడం వలన భూమి గుల్లబారి, తేమ శాతం పెరిగి సూక్ష్మపోషకాలు వద్ధి భూసారం పెరుగుతుంది.

బీజామృతం తయారీ ఇలా...

దేశీ ఆవుపేడను పలచటి గుడ్డలో మూట కట్టి 20 లీటర్ల నీరు ఉన్న తొట్టెలో 12 గంటలు ఉంచాలి. ఒక లీటర్ నీటిని వేరే పాత్రలో తీసుకుని 50 గ్రాముల సున్నం కలిపి రాత్రంతా ఉంచి నానబెట్టిన పేడ మూటను చేతితో పిండి రసాన్ని నీటి తొట్టెలో కలపాలి. ఇలా వచ్చిన ద్రావణాన్ని 12 గంటల పాటు నిల్వ ఉంచి మరునాడు విత్తనాలకు పట్టించి నీడలో ఆరబెట్టి నాటితే ఏ రకమైన చీడపీడలు రాకుండా విత్తనాలు మొలకెత్తుతాయి.



నార్నెపాడులో మహిళా రైతు పూజ సాగు చేస్తున్న చిరుధాన్యాల సాగు విధానాన్ని పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవ సాయ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి. విజయ కుమార్ , ఇతర అధికారులు (ఫైల్ ఫొటో)

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

కె.అమల కుమారి, డిపిఎం, ప్రకృతి వ్యవసాయం



గ్రామసభలు ఏర్పాటు చేసి వీఓ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆయా రైతు భరోసా కేంద్రాల పరిధిలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. తొలకరి వర్షాలకు రైతులు నవ ధాన్య విత్తన గుళికలు పంట పొలాల్లో చల్లడం ద్వారా పచ్చిరొట్ట తయారవుతుంది. 40 రోజుల్లో మొలకెత్తిన పంట ఏపుగా పెరిగి, పశుగ్రాసంగా ఉప యోగపడుతుంది. అలాగే భూమి సారవంతమవుతుంది. నవ ధాన్యాల సాగుతో ప్రధాన పంటలలో అధిక దిగుబడి సాధ్యమవుతుంది. గత ఏడాది మంచి ఫలితాలు వచ్చాయి. భూమిలో మొక్కలకు ఉపయోగపడే సూక్ష్మజీవులు పెరుగుతాయి. ఘన, ద్రవ జీవామృతాలు వేసుకుంటే ఇంకా మంచి ఫలితాలు వస్తాయి. ఈ తరహాలో సాగు చేసి మంచి దిగుబడులు సాదించాలి.


లింగా వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న అరవిందబాబు

మార్కెట్ యార్డ్ మాజీచైర్మన్‌కు పరామర్శ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఇటీవల ప్రమాదవశాత్తు కాలుజారిపడి గాయాలపాలై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న రొంపిచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు లింగా వెంకటేశ్వర్లను నరసరావుపేట ఎమ్మెల్యేగా ఎన్నికైన డాక్టర్ చదలవాడ అరవిందబాబు పరామర్శించారు. ఆదివారం కర్లకుంట గ్రామానికి వెళ్లిన అరవిందబాబు, వెంకటేశ్వర్లును కలిసి యోగక్షేమాలను, ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో టిడిపి గెలుపునకు కృషి చేయడంపై తకృతజ్ఞతలు చెప్పారు. వెంకటేశ్వర్లు కోలుకుని త్వరితగతిన ప్రజాక్షేత్రంలోకి రావాలని అరవింద బాబు ఆకాంక్షించారు. టిడిపి నాయ కులు వి.కిషోర్ పాల్గొన్నారు.



విగ్రహాలను కూల్చాలని చూస్తే చర్యలు

ప్రజాశక్తి-నకరికల్లు

గ్రామాలలో ఎవరైనా రాజకీయ నాయకుల విగ్రహాలను కూల్చాలని చూస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహశీల్దార్ లక్ష్మీనారాయణ ఆదివారం తెలిపారు.మండలంలోని నరసింగపాడులో తహశీల్దార్, ఎస్సై నాగేంద్రరావుతో కలిసి ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సచివాలయం పరిధిలోని పంచాయతి కార్యదర్శి, విఆర్వోలు, విఆర్ఎలు, గ్రామస్తులతో కలిపి శాంతి కమిటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాజకీయ పార్టీలపరంగా ఘర్షణలకు దిగితే వారి సమాచారం తమకు అందజేయాలని గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎస్.శివారెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లిలోని మహారాష్ట్ర వీధిలో ఏర్పాటు చేసిన ఛత్రపతి శివాజీ విగ్ర హాన్ని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ఆదివారం ప్రారంభించారు. ఆర్య క్షత్రియ,ఆరె మరాఠ సంఘం ఆధ్వ ర్యంలో శివాజీ విగ్ర హాన్ని 25వ వార్డులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో ప్రద ర్శన నిర్వహించారు. శివాజీ విగ్ర హానికి పూల మాలలు వేసిన నాగరాజు ఘనంగా నివాళులర్పించారు. విగ్రహావిష్కరణ కమిటీ నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.


శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాగరాజు

పెదకూరపాడులోని అన్ని మండలాల్లో
ఓట్లు వచ్చిందిలా..!

ప్రజాశక్తి-పెదకూరపాడు

నియోజకవర్గంలో ఐదు మండలాలు ఉన్నాయి. శివార్లు, తండాలతో కలిపి 106 గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికలు-2024లో బెల్లంకొండ మండలంలో 10 గ్రామాలలో టిడిపికి, నాలుగు గ్రామాలలో వైసీపీకి మెజారిటీ వచ్చింది. వైసీపీకి నందిరాజుపాలెం 92, వన్నాయపాలెం 191, పాపాయి పాలెం 428, మన్నె సుల్తాన్ పాలెం 140 ఓట్లు వచ్చాయి. టిడిపికి నాగిరెడ్డిపాలెం 55, బెల్లంకొండ 93, గంగిరెడ్డిపాలెం 475, కొత్తపాలెం 86,మాచాయపాలెం 319, ఆర్ఆర్ సెంటర్ 196, చంద్రాజు పాలెం 307, కందిపాడు 40, ఎమ్మాజీ గూడెం 20,వెంకటాయపాలెం 145, ఓట్లు వచ్చాయి. 2019లో వైసీపీకి 4225 ఓట్లు మెజారిటీ రాగా, ఈ ఎన్ని కల్లో టిడిపి 915 ఓట్లు ఆధిక్యత సాధిం చింది.

అచ్చంపేటలో..

మండలంలో శివార్లు తండాలు కలిపి 28 గ్రామాలు ఉన్నాయి. చెరో 14 గ్రామాలలో మెజారిటీ సాధించాయి. 2019లో వైసిపికి మూడు గ్రామాల్లో మినహా అన్ని గ్రామాల్లో భారీ మెజార్టీలు లభించాయి. ప్రస్తుత ఎన్నికలలో వైసీపీకి మాదిపాడు 177, గింజుపల్లి 134, చల్లగరిక 196, తాడువాయి 36, పుట్లగూడెం 173, తాళ్లచెరువు 1022, చామర్రు 86,నీలేశ్వరపాలెం 192,కె.వి పాలెం 313,కస్తల 236, పెద పాలెం 18, ఆర్ఆర్ సెంటర్ 42,కొండూరు 37, నిండుజర్ల 86 ఓట్లు సాధించింది. తెలుగుదేశం పార్టీకి కంచుబోడు తండా 48, చింతపల్లి 68, చెరుకుంపాలెం 284, కొత్తపల్లి 18,అచ్చంపేట 324, చిగురుపాడు 91,ఆర్‌కేజి సెంటర్ 95, అంబడిపూడి 38, కోనూరు 270, ఒరవగల్లు 58, రుద్రవరం117,గ్రంథసిరి 520, వేల్పూరు 883, మిట్టపాలెం 256 ఓట్లు లభించాయి. 2019 ఎన్నికలలో వైసీపీ 7597 మెజార్టీ సాధించింది. ఈ ఎన్నికలలో టిడిపికి 246 ఓట్ల ఆధిక్యత లభించింది.

క్రోసూరులో..

మండలంలో గ్రామాలు గ్రామ శివార్లు కలిపి 21 ఉన్నాయి. ప్రస్తుత ఎన్నికలలో వాటిలో 18 గ్రామాల్లో టిడిపికి ఆధిక్యత లభించింది. మూడు గ్రామాల్లో వైసిపి మెజారిటీ సాధించింది. 2019 ఎన్నికలలో అత్యధిక గ్రామాలలో భారీ మెజార్టీ లభించాయి. ప్రస్తుత ఎన్నికలలో టిడిపి గ్రామాల వారీగా లభించిన ఓట్లు దొడ్లేరు 106, ఆవులువారి పాలెం 122, పెరికపాడు 137, హసనాబాద్ 496, నాగవరం 734, గుడిపాడు 222, గాదెవారి పాలెం 44, గరికపాడు 46, ఉయ్యందన 483, 88 తాళ్లూరు 1054, పీసపాడు 23, ఎర్రపాలెం 144, అందుకూరు 512, బాలెమర్రు 57, విప్పర్ల 75, ఊటుకూరు 110, బయ్యవరం 959 ఓట్లు తో ఆదిక్యత లభించింది. వైసిపికి పెరికపాడు తండా 95, పారుపల్లి 197, క్రోసూరు 58 గ్రామాలలో మెజారిటీ వచ్చింది. అనంతవరంలో ఇరువురికి 1231 ఓట్ల లభించాయి. దీంతో ఆ గ్రామంలో ఎవరికీ మెజార్టీ రాని పరి స్థితి ఉంది. 2019 ఎన్నికలలో 4367 ఓట్ల ఆధిక్యత వైసి పికి లభిం చింది. 2024 ఎన్నికలలో టిడిపికి 4974 ఓట్ల మెజారిటీ లభించింది.

పెదకూరపాడులో..

మండలంలో 20 గ్రామాలు ఉన్నాయి. 2019 ఎన్నికలలో వైసీపీకి తాళ్లూరులో 1228, పాటి బండ్లలో 1154 ఓట్లు లభించాయి. చాలా చోట్ల టిడిపి మెజారిటీని తగ్గిం చింది. ప్రస్తుత ఎన్ని కలలో తెలుగుదేశం పార్టీ మెజార్టీ సాధించిన గ్రామాలు గార పాడు 537, కన్నెగండ్ల 184, హుస్సే నగరం 358, బుచ్చయ్యపాలెం 304, పెదకూరపాడు 1319, అబ్బ రాజుపాలెం 151, లింగంగుంట్ల 693, పొడపాడు 267, మూసాపురం 260, జలాల్పురం 120, ఖమ్మంపాడు 173, బలుసుపాడు 394, కాశిపాడు 495, తమ్మవరం 398, పరస 156 ఓట్లు ఆధిక్యత లభించింది. వైసీపీకి లగడపాడు 133, రామాపురం 37, చిన్నమక్కెన 84, పాటిబండ్ల 371, తాళ్లూరు 940 ఓట్లు అధికంగా వచ్చాయి. ప్రస్తుతం జరిగిన ఎన్నికలలో టిడిపికి 4204 ఓట్ల ఆధిక్యత లభించింది.

అమరావతిలో..

మండలంలో శివారు గ్రామాలతో కలిపి 22 ఉన్నాయి. ప్రస్తుత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి 18 గ్రామాలలో మెజారిటీ లభించింది. నాలుగు



గ్రామాలలో వైసీపీకి ఆధిక్యత చోటుచేసుకుంది. 2019 ఎన్నికలలో తెలుగుదేశం పార్టీకి 759 ఓట్ల మెజారిటీ రాగా, 2024 ఎన్నికలలో 10,366 ఓట్లతో భారీ మెజార్టీ లభించింది.

పోస్టల్ బ్యాలెట్‌లో..

2019 ఎన్నికలలో పోస్టల్ బ్యాలెట్ లో వైసిపి పార్టీకి ఆధిక్యత లభించింది. ప్రస్తుత ఎన్నికలలో 2128 పోస్టల్ బ్యాలెట్ ఓట్లలో 299 ఓట్లు చెల్లలేదు. మిగిలిన వాటిలో నోటాకు 14 ఓట్లు, కాంగ్రెస్‌కి 10 ఓట్లు, తెలుగుదేశం పార్టీకి 977 ఓట్లు, వైసీ పీకి 820 ఓట్లు లభించాయి. 157 ఓట్లు టిడిపికి మెజార్టీ లభించింది.

ఇవీ కారణాలు..

నియోజకవర్గంలో టిడిపికి భారీ మెజారిటీకి పలు కారణాలు న్నాయి. అమరావతిని ఏకైక రాజధానిగా ప్రకటించటం, ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రచారం, వైసిపి ప్రభుత్వ నిరంకుశ, అణిచివేత ధోరణి, అక్రమకేసులు, యువతకు ఉపాధి లేకపోవటం, ధరలు పెంచడం, అభివృద్ధి జరగలేదని అంశాలు, సూపర్ సిక్స్ పథకాలు ప్రచారం, జనసేనతో పొత్తు, చంద్రబాబును అరెస్టు చేయడంతో శ్రేణులలో కసి పెరగటం మొదలైనవి కలిసొచ్చాయి.

మున్సిపల్ కార్మికులపై పని ఒత్తిడి పెరిగింది

ప్రజాశక్తి-పిడుగురాళ్ల


మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మున్సిపల్ వర్కర్స్ యూనియన్ సమావేశం పిడుగురాళ్ల పట్టణంలోని వర్కర్స్ కాలనీలో కె.సీతారామయ్య అధ్యక్షతన ఆది వారం నిర్వహించారు.ఈ సంద ర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చంద్రకళ మాట్లాడుతూ మున్సిపల్ వర్కర్లపై పని ఒత్తిడి పెరిగిందని అన్నారు. సబ్బులు, నూనెలు, యూనిఫామ్‌లు కార్మికులకు వెంటనే ఇవ్వాలని, చనిపోయిన కార్మికులకు రావాల్సిన పరిహారం ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉందని, వెంటనే విడుదల చేయాలని, వర్కర్స్ కు పనిముట్లు ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెండింగ్ లో ఉన్న హెల్త్ అలవెన్స్ వెంటనే ఇవ్వాలని తదితర సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసీద్,సిఐటియు మండల కార్యదర్శి తెలకపల్లి శ్రీనివాసరావు, కార్మికులు రామారావు, కాంద్రగుంట ఎలమంద,దేవల్ల చిన్న వెంకటేశ్వర్లు మహంకాళి యాలంకయ్య, కంపసాని వీరమ్మ, కృష్ణవేణి, జయేంద్ర,చల్లా పద్మ,దేవరకొండ లక్ష్మి, కోడిరెక్క మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణకు మంత్రి పదవి దక్కే అవకాశం?

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్



సత్తెనపల్లి నియోజకవర్గ ఎమ్మె ల్యేగా ఎన్నికైన కర్ణ లక్ష్మీనారాయణకి మంత్రి వర్గంలో స్థానం కల్పించే అవకాశం ఉన్నట్లు టిడిపి నాయకులు చర్చిం చుకుంటున్నారు. సత్తెనపల్లి అసెంబ్లీ నియోజకవర్గానికి మే 13న జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లక్ష్మీనారాయణ 27, 236 ఓట్ల భారీ మెజా రిటీతో వైసిపి అభ్యర్థి అం బటి రాంబాబుపై గెలు పొందారు. సత్తెనపల్లి నియోజకవర్గానికి జరిగిన సార్వ త్రిక ఎన్నికల్లో ఇంతవరకు ఏ అభ్యర్థికి రాని 27,836 ఓట్ల మెజారిటీ లక్ష్మీనారాయణకు వచ్చింది. గతంలో పెదకూరపాడు అసెంబ్లీ నియోజకవర్గం నుండి వరు సగా నాలుగు సార్లు ఆయన ఎమ్మెల్యేగా ఎన్ని కయ్యారు.1989 నుండి 2009 వరకు ఎమ్మెల్యే గా పనిచేశారు. 2009లో గుంటూరు పశ్చిమ నియోజక వర్గం నుంచి గెలుపొందారు. ఐదుసార్లు మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. 1991 -1994 వరకు రాష్ట్ర మంత్రిగా పని చేశారు. 2004 నుండి 2009 వరకు కేబినెట్ మంత్రిగా, 2009లో భారీ పరిశ్రమల మంత్రి గా, 2010లో గహ నిర్మాణ శాఖ మంత్రిగా, 2012 లో వ్యవసాయ శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. కాపు సామాజిక తరగతికి చెందిన లక్ష్మీ నారాయణకు మంత్రి పదవి దక్కే అవకాశాలున్నాయని ఆయన అభిమానుల ఆశాభావం.

నీట్ ర్యాంకర్లకు సన్మానం

ప్రజాశక్తి - వినుకొండ

ఆల్ ఇండియా నీట్‌లో ర్యాంక్‌లు సాధించిన విద్యార్థులను విశ్వసాయి జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో కళాశాల యాజమాన్యం ఆది వారం ఘనంగా సన్మానించింది. ఈ వారం విడుదలైన 2024 ఆల్ ఇండియా అండర్ గ్రాడ్యుయేట్ నీట్ రిజల్ట్స్ లో విశ్వసాయి విద్యార్థులు పల్నాడు జిల్లా లోనే టాప్ వన్ ర్యాంక్ సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను వారి తల్లిదండ్రులను, దానికి కృషి చేసిన అధ్యా పకులను, కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రస్తుతం కళాశాలలో ఇంటర్మీడియట్ పూర్తి చేసుకున్న విద్యార్థిని కాకుమాను తేజస్విని 507/720 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్,పల్నాడు జిల్లాలో అత్యుత్తమ ర్యాంక్ సాధించింది.



విద్యార్థులనుఉపాధ్యాయులను, తల్లిదండ్రులను సన్మానిస్తున్న విశ్వసాయి జూనియర్ కళాశాల యాజమాన్యం

కళాశాల నుంచి ఐదుగురు విద్యార్థులు నీట్ పరీక్ష రాయగా వారు క్వాలిఫై అయినట్లు కళాశాల యాజ మాన్యం తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుంచి తమ జూని యర్ కళాశాల ఆధ్వర్యంలో వినుకొండలోని బ్యాంక్ ఆఫ్ బరోడా బిల్డింగ్ పైన మహిళా క్యాంపస్ ప్రారంభించడం జరిగింది అని కళాశాల యాజమాన్యం తెలిపింది. బాయ్స్ క్యాంపస్ , గర్ల్స్ క్యాంపస్‌లలో కూడా నీట్, ఐఐటి జేఈఈ మెయిన్స్ , ఎంసెట్ క్లాసులు, బాల బాలికలకు ప్రత్యేక హాస్టల్ వసతి కూడా ఈ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు కళాశాల డైరెక్టర్ డాక్టర్ యడవల్లి శ్రీనివాస శర్మ, ప్రిన్సిపాల్ శ్రీవల్లి పావని తెలిపారు.

చెత్త పన్ను ఎత్తేస్తారా? ట్రూఆప్ ఛార్జీలు తీసేస్తారా?

ప్రజాశక్తి-తాడేపల్లి

గతంలో ఎన్నడూ లేని విధంగా వైసిపి ప్రభుత్వం ఇళ్ల నుంచి సేకరించే చెత్తకు కూడా పన్ను వేసింది. ఈ విధానం ప్రజల్లో తీవ్ర ఆగ్రహావేశాలు తెప్పించింది. ఇంటి పన్ను వసూళ్లతో పాటు లైబ్రరీ సెస్, గ్రంథాలయం పన్ను, డ్రెయినేజీ పన్నుతో పాటు అన్ని కలిపి వసూలు చేసే పద్ధతి ఎప్పటి నుంచో ఉంది. కొత్తగా చెత్త పన్ను కట్టాల్సిందేనని వైసిపి ప్రభుత్వం జిఒ తెచ్చింది. కేంద్రంతో సఖ్యత కోసం బిజెపి పట్టణ సంస్కరణల్లో భాగంగా బలవంతంగా ప్రజల నుంచి చెత్త పన్ను వసూలుకు శ్రీకారం చుట్టారు. పన్ను చెల్లించని వారి ఇళ్లు, షాపులు ముందు వివిధ ప్రాంతాల్లో సేకరించిన చెత్తను తీసుకొచ్చి గుమ్మరించారు. ఇది ప్రజాగ్రహానికి కారణమయ్యాయి. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. చెత్త పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించి ముందుకు వెళ్లింది. ఎన్నికలు జరిగే వరకు గత ప్రభుత్వం చెత్త పన్నును కొనసాగించింది.

ట్రూఆప్ ఛార్జీల పేరుతో విద్యుత్ భారాలు మోపింది. దీనిపై కూడా ప్రజాగ్రహం పెల్లుబికింది. ఎప్పుడో ఐదేళ్ల క్రితం వినియోగించిన విద్యుత్‌కు బకాయి ఉందంటూ

రంగం సిద్ధమంటూ సోషల్ మీడియాలో ప్రచార జోరు!



విద్యుత్ వినియోగదారుడు ఉపయోగించిన దానికంటే రెండు నుంచి మూడు రెట్లు ఛార్జీలు అదనంగా వసూలు చేశారు. ఇంధనం సర్‌ఛార్జీ, సర్దుబాటు, డిస్కమ్ ఛార్జీలంటూ ముద్దుపేర్లు పెట్టారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చినా పట్టించుకోలేదు. ఇప్పటికీ వినియోగదారులు ఉపయోగించిన దాని కంటే అధికంగా బిల్లులు చెల్లిస్తున్నారు.

ఇటీవల రాష్ట్రంలో టిడిపి అధికారంలోకి వచ్చింది. గత ఆరు రోజుల నుంచి వాట్సప్, సోషల్ మీడియాలో విద్యుత్ ఛార్జీల తగ్గింపు, చెత్త పన్ను ఎత్తివేయడానికి రంగం సిద్ధం అంటూ పెద్దఎత్తున ప్రచారమవుతోంది. చెత్త పన్ను, విద్యుత్ సంస్కరణలు తెచ్చిన బిజెపితో ప్రస్తుత అధికారంలోకి రాబోతున్న ప్రభుత్వం జత కట్టింది. నిజంగా వీటిని టిడిపి ప్రభుత్వం ఎత్తివేస్తుందా? అనే ప్రశ్న వస్తోంది. చెత్త పన్ను, విద్యుత్ భారాలను సిపిఎం క్షేత్రస్థాయిలో వ్యతిరేకించింది. చెత్త పన్ను కట్టవద్దని ప్రజల్ని చైతన్యపరిచింది. విద్యుత్ ఛార్జీల భారం ఏ విధంగా మోపుతున్నారో ప్రజలకు తెలియజెప్పింది. పట్టణ పౌర సంక్షేమ సంఘం, తదితర ప్రజా సంఘాలను కలుపుకుని ఉద్యమాలు నడిపింది. అయినా ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయాల ముందు చెత్త పన్ను ఎత్తివేయాలని ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన తెలిపినా ప్రభుత్వం మొండిగా ప్రజల నుంచి చెత్త పన్ను, ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేసింది. తాజా రాష్ట్రంలో ఏర్పడే కూటమి ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుంటుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



నసీర్ అహ్మద్‌కు శుభాకాంక్షలు చెబుతున్న తాపీ మేస్త్రీలు

ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌కు తాపీ మేస్త్రుల సంఘం శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు తూర్పు ఎమ్మెల్యేగా ఎన్నికైన నసీర్ అహ్మద్‌ను స్థానిక పొన్నూరు రోడ్డులోని ఆయన కార్యాలయంలో తాపీ మేస్త్రీల సంఘం నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అసోసియేషన్ నాయకులు కోరారు. నసీర్ అహ్మద్ మాట్లాడుతూ తాపీ వర్కర్ల సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని, గృహ నిర్మాణానికి సంబంధించి ఇసుక, ఐరన్, సిమెంట్ ధరలను నియంత్రిస్తామని, కార్మికులకు బీమా ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు అల్లం బాజీ, దురశల శ్రీనివాస్, లక్ష్మీశెట్టి రమేష్, కోట శ్రీను, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు

గుంటూరు తూర్పు ఎమ్మెల్యేగా ఎన్నికైన నసీర్ అహ్మద్‌ను పొన్నూరు పట్టణానికి చెందిన టిడిపి ముస్లిమ్ మైనార్టీ నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. పలు సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి విన్నవించారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా మైనారిటీ కార్యదర్శి జానీబేగ్, విజయవాడ ఫెర్టిలైజర్స్ అధినేత హిదయతుల్లా, కనకదుర్గ బార్ అండ్ రెస్టారెంట్ అధినేత ఖదీర్, అడ్వకేట్ మగ్బుల్ బేగ్, అమిరుద్దీన్, సుబానీ, టిడిపి నాయకులు సుబానీ, ఎలక్ట్రానిక్స్ షేక్ సుభాని పాల్గొన్నారు.

నూతి బాపయ్యచౌదరికి సత్కారం

ప్రజాశక్తి - పెదనందిపాడు

ప్రజలకు చేసిన సేవలకుగాను నీతి అయోగ్ నుండి పురస్కారం అందుకున్న పెదనందిపాడు జెడ్‌పి పాఠశాల పూర్వ విద్యార్థి, నాట్స్ (ఉత్తర అమెరికా తెలుగు సంఘం) మాజీ అధ్యక్షులు నూతి బాపయ్య చౌదరిని గ్రామస్తులు ఆదివారం సత్కరించారు. జెడ్‌పి పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామికవేత్త దాసరి శేషగిరిరావు, పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదుర్గ, నూతి శ్రీనివాసరావు, కొల్లా సీతారామయ్య, కాకుమాను నాగేశ్వరరావు హాజరయ్యారు. అతిథులు, పాఠశాల సిబ్బంది, గ్రామ పెద్దలు కలిసి బాపయ్య చౌదరిని సన్మానించారు. అనంతరం బాపయ్య చౌదరి మాట్లాడుతూ పెదనందిపాడులో పలు రకాల సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. తాను చదువుకున్న పాఠశాలకు భోజనశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే శంకుస్థాపన చేసి పనులు ప్రారంభిస్తామని చెప్పారు.



బాపయ్య చౌదరిను సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

30 ఏళ్ల తర్వాత వర్సిటీ పూర్వ విద్యార్థుల కలయిక

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1993-95 బ్యాచ్ రాజనీతి శాస్త్రం, ప్రభుత్వ పాలనా శాస్త్రం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం జరిగింది. కార్యక్రమానికి రాజనీతి శాఖాధిపతి అంజరెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు హాజరై సమాజంలో రాజకీయ శాస్త్ర విద్యార్థుల బాధ్యతను గుర్తు చేశారు. ప్రత్యేక అతిథిగా నెల్లూరు డిప్యూటీ విజిలెన్స్ కలెక్టర్ పద్మాదేవి, ప్రత్యేక ఆహ్వానితునిగా విశ్రాంతి ఆచార్యులు ప్రొఫెసర్ సి.హెచ్.నారాయణరావు, ప్రొఫెసర్ భవాని ప్రొఫెసర్ ఆర్.ఆర్.లక్ష్మీకాంత హజరయ్యారు. 30 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు ఒక్కసారిగా భావోద్రేకాలకు లోనయ్యారు. తాము చదువుకున్న రోజులను గుర్తు చేసుకోవడంతోపాటు ప్రస్తుతం ఒకరి కుటుంబ పరిస్థితిలను ఒకరు తెలుసుకున్నారు. కార్యక్రమంలో వై.శివనాగరాజు, పి.శ్రీధర్, నరసింహారావు, జోసఫ్ కుమార్, సుబ్బారావు, మల్లేశ్వర వర ప్రసాదు, శివనాగేశ్వరావు, డాక్టర్ పి.నాగయ్య పాల్గొన్నారు.



ప్రొఫెసర్లు, అతిథులతో పూర్వ విద్యార్థులు

వికలాంగులు ఎందులోనూ తీసిపోరు : ఎమ్మెల్యే మాధవి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

చెస్ అసోసియేషన్ ఫర్ విజువల్లి ఛాలెంజ్డ్ ఆంధ్రప్రదేశ్, ఆల్ ఇండియా చెస్ ఫెడరేషన్ ఫర్ ది బ్లైండ్ ఆధ్వర్యంలో గుంటూరు సమర్థన వికలాంగుల సంస్థ సహకారంతో గుంటూరు హిందూ ఫార్మసీ కాలేజీలో తెలుగు రాష్ట్రాల రాష్ట్ర స్థాయి జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. ఆదివారం జరిగిన బహుమతి ప్రధానోత్సవానికి ముఖ్యఅతిథిగా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే డాక్టర్ గల్లా మాధవి హాజరై మాట్లాడారు. వికలాంగులు ఎందులోనూ తీసిపోరని అన్నారు. క్రమశిక్షణతో పాటు తాము పూర్తిస్థాయి విజయాన్ని సాధించాలనే విశ్వాసంతో చెస్ ఆడుతున్న వారిని చూడటం చాలా ఆశ్చర్యం కలిగించిందని చెప్పారు. ఇటువంటి వారు జీవితంలో అత్యంత తెలివి కలిగి ఉన్నత స్థాయికి ఎదగాలని అన్నారు. సమర్థన సంస్థ చైర్మన్ డాక్టర్ పరమహంస మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరుగుతున్న ఎంపిక పోటీల్లో ఆంధ్రప్రదేశ్ నుండి 21 మంది క్రీడాకారులను, తెలంగాణ నుండి 10 మంది క్రీడాకారులను ఎంపిక చేసి ఆగస్టులో జరగనున్న సౌత్‌జోన్ టోర్నమెంటుకు పంపిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రామసేతు పెయింట్స్ అండ్ హార్డ్ వేర్ అధినేత పి.సుధాకర్, చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎస్.వెంకట్ రెడ్డి, ట్రెజరర్ ఎం.ప్రసన్నకుమార్, ఆర్బిటర్‌గా గోపీనాథ్, సెక్రెటరీ సిహెచ్ కుమార్‌రాజా పాల్గొన్నారు.



బహుమతి ప్రధానోత్సవంలో గల్లా మాధవి

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాల్సిందే

ప్రజాశక్తి-గుంటూరు

రాష్ట్రంలో వివాదాస్పదంగా మారిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేయాలని, ఎన్నికల ప్రచారంలో తాము అధికారంలోకి వస్తే ఈ చట్టాన్ని రద్దు చేస్తామని టిడిపి ఇచ్చిన హామీని నెరవేర్చుకోవాలని అవగాహన సంస్థ కోరింది. ఈ మేరకు సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా వ్యతిరేక యాక్ట్‌ను ఉత్సాహంగా ప్రజలపై రుద్దాలని ప్రయత్నించినందువల్లే వైసిపి ప్రభుత్వం తీవ్ర ఓటమి పాలైందని పేర్కొన్నారు. ఈ చట్టం అధికారులు, అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధుల ఇష్టారాజ్యంగా నడుస్తుందనే ఆందోళన ప్రజల్లో నెలకొన్నదని, 'మీ భూమి మీది కాదు ఎప్పుడైనా ప్రభుత్వం లాక్కోవచ్చు' అనే ప్రచారాలు విస్తృతమై మధ్యతరగతి ప్రజలు కసితో గత ప్రభుత్వాన్ని ఓడించారనే విషయం నూతన ప్రభుత్వం గుర్తుంచుకోవాలని సూచించారు.



అబాకస్‌తో గణితంలో ప్రావీణ్యం, జ్ఞాపకశక్తి

ప్రజాశక్తి - పొన్నూరు

యుసిఎంఎఎస్ పొన్నూరు ఆధ్వర్యంలో 4-13 ఏళ్ల విద్యార్థులకు అబాకస్‌పై ఏప్రిల్, మే నెలల్లో ఇచ్చిన శిక్షణ ముగిసింది. ఈ సందర్భంగా పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ధ్రువపత్రాలను ఆదివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో అందించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కె.అనూష మాట్లాడుతూ అబాకస్‌తో జ్ఞాపకశక్తి, సృజనాత్మక శక్తి, ఆత్మస్థైర్యం పెరుగుతుందని, గణితం సులువుగా చేయడానికి వీలవుతుందని చెప్పారు. కార్యక్రమంలో కీర్తి హాస్పిటల్స్ డాక్టర్ శివకుమార్, డాక్టర్ కీర్తి, వేద స్కూల్ డైరెక్టర్ అంబటి వెంకటేశ్వరరావు, హోమియో వైద్యులు లక్ష్మికుమారి, సంస్థ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇన్‌ఛార్జి శ్రీకాంత్ పాల్గొన్నారు.



రాష్ట్రంలో ఇకపై సుపరిపాలన : నరేంద్ర

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ఆధ్వర్యంలో సూపరిపాలన అందిస్తామని పొన్నూరు ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ అన్నారు. స్థానిక శ్రీలక్ష్మి నరసింహస్వామి దేవస్థానాన్ని ఆదివారం సందర్శించిన ఆయన విలేకర్లతో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలు వేధింపులక గురయ్యారని, తాజా ఎన్నికల్లో అధర్మంపై ధర్మం గెలిచిందని అన్నారు. మంగళగిరిలో గతంలో ఎన్నడూ లేనివిధంగా నారా లోకేష్ భారీ మెజార్టీతో విజయం సాధించడం సంతోషంగా ఉందన్నారు. ఇదిలా ఉండగా నరేంద్రకుమార్‌కు ఆలయ ఈవో ఏ.రామకోటిరెడ్డి స్వాగతం పలికారు. టిడిపి నాయకులు సంక బాలాజీ గుప్తా, వాకా మంగారావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - పొన్నూరు : ఎమ్మెల్యేగా డి.నరేంద్ర కుమార్ భారీ మెజార్టీతో గెలిసిన సందర్భంగా పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహం నుండి బాపట్ల జిల్లా చెరుకుపల్లి పివి పాలెం మండలం చందోలులోని శ్రీ బండ్లమ్మ తల్లి దేవాలయానికి ఆదివారం పాదయాత్రగా వెళ్లారు. వీరిలో బి.బాబురావు, ఎ.వరప్రసాదరావు, సిహెచ్.భాస్కర్, ఎల్.మోహనకృష్ణ, వై.శివశంకర్, సిహెచ్.విజయ్, టి.రవి, లాడెన్, బాజీ, రబ్బాని, పి.రత్నకుమారి, వి.సామ్రాజ్యం తదితరులున్నారు.



అన్నవరంలోని ఇంటి ముందు నిలిచిన మురుగు నీరు

ఎస్సీకాలనీలో సమస్యలు తిష్ట

- మురుగు నీరంతా రోడ్డు మీదే
- ఇబ్బంది పడుతున్న కాలనీ వాసులు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నిన్న మొన్నటి వరకు అధికారంలో ఉన్న జగన్ మోహన్‌రెడ్డి, ఎస్సీలకు, అణగారిన వర్గాలకు ఒరగ బెట్టిందేమి లేదని ఎస్సీ కాలనీ వాసులు విమర్శిస్తున్నారు. రొంపిచర్ల మండలంలోని అన్నవరంలోని ఎస్సీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో మురుగు నీరు రోడ్డుపైకి వస్తోందని కాలనీ వాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. 2019 కి ముందు టిడిపి హయాంలో అసంపూర్తిగా నిర్మించిన సిమెంట్ రోడ్డును ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసిపి పూర్తి చేయలేదని చెప్పారు. చిన్నపాటి వర్షానికే ఇళ్ల నుండి బయటకు రాలేని పరిస్థితి నెలకొందని, మురుగునీరు నిరంతరం నిలిచి ఉంటోందని చెప్పారు. బురదలో నడవాల్సి వస్తోందని, పాఠశాలకు ఈ మార్గం ద్వారానే విద్యార్థులు వెళ్లాలని, మురుగునీటి నిల్వ కారణంగా దోమలు అధికమై విషజ్వరాలకు గురవుతున్నారని ఎస్సీ కాలనీ వాసులు వాపోయారు. ఏళ్ల తరబడి



అసంపూర్తిగా సిమెంట్ రోడ్డు... అధ్వానంగా మట్టి రోడ్డు

సమస్య ఇలా ఉన్నా పంచాయతి అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. గ్రామంలోని మురికి కాలువల నీరంతా ఎస్సీ కాలనీలోని రోడ్డు పైకి వచ్చి చేరుతుండడంతో సమస్య జఠిలంగా మారిందని చెబుతున్నారు. పేరుకుపోయిన మురుగు కారణంగా దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కాలనీ వాసులు కోరుతున్నారు.



నిరుపేద కుటుంబాలకు నిత్యావసరాల వితరణ

ప్రజాశక్తి - వినుకొండ

ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ప్రతి నెలా నిత్యావసరాల వితరణలో భాగంగా వినుకొండ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం జివి మాధవరావు ఆఫీస్‌లో వాటిని అందజేశారు. ఆరు నిరుపేద బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నూతన వస్త్రాలను అందజేశారు. ఈ నెలలో నిత్యావసరాలను సమకూర్చిన దాతలు సిహెచ్.రాఘవేంద్రరావు, సిహెచ్ భవాని శంకర్, జి.నాగరాజు,డి.రామమూర్తి, జి. మారుతి మహాలక్ష్మి, మౌనిక, ఆర్యవైశ్య ప్రముఖులు అన్నా వీర బ్రహ్మం, నాగమల్లేశ్వరి సహాయ సహకారాలు అందించారు. ఈ సందర్భంగా మాధవరావు మాట్లాడారు. కార్యక్రమంనకు డి.నాగే శ్వరరావు, బి.సుబ్రహ్మణ్యం, ఎస్ఎస్ వై.శాస్త్రి, సిహెచ్ భద్రయ్య, బి.రవి కుమార్, ఎ.సుబ్బారావు, ఎ. వెంకటేశ్వర రావు, ఎంవి శర్మ హాజరయ్యారు.

అవగాహనతోనే డెంగీకి అడ్డుకట్ట

- మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు
- గుంతల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలి
- దోమల నిర్మూలన కోసం ఫాగింగ్
- జిల్లా మలేరియా నివారణ అధికారి కె.రవీంద్ర రత్నాకర్



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో వైద్య సిబ్బందితో మలేరియా నివారణకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా అధికారి డాక్టర్ కె.రవీంద్ర రత్నాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం ప్రజాశక్తితో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఈ నెల 1వ తేదీ నుండి ప్రారంభమైన మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు 30 వరకు జరగనున్నట్లు చెప్పారు.




దోమల నివారణకు మలాథియన్ పిచికారి చేస్తున్న ఫాగింగ్ సిబ్బంది

మలేరియా వ్యతిరేక మాసోత్సవాలపై ఇటీవల జిల్లా స్థాయి ప్రణాళిక కమిటీ సమావేశం నిర్వహించామన్నారు. 'ప్రజల భాగస్వామ్యంతో డెంగీ వ్యాధిని నివారిద్దాం' అనే నినాదంతో జిల్లా అధికార యంత్రాంగం జిల్లా వ్యాప్తంగా అవగాహనర్యాలీలు నిర్వహించినట్లు చెప్పారు. మూతలు లేని నిల్వనీటిపై దోమలు వాలి గుడ్లు పెడతాయని, ఈ గుడ్లు 10 రోజులలో దోమలుగా మారి నీటి నుంచి బయటకు వెళ్లిపోతాయని అధికారులు తెలియజేస్తున్నారు. ప్రజలు వారానికి ఒక్కసారి నీటి నిల్వలను తప్పక మార్చుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు విస్తారంగా పడటంతో మలేరియాకు కారణమైన దోమలు పెరుగుదలను అరికట్టడంలో భాగంగా వైద్య ఆరోగ్యశాఖతో పాటు పంచాయతీ రాజ్,మున్సిపల్ , విద్యా శాఖ, మైన్స్ శాఖ, మత్స్య, మొదలగు శాఖలతో సమన్వయం చేసుకొని దోమలు పెరిగేందుకు కారణమైన నీటి నిల్వలను నిర్మూలించాలని, నీటి నిల్వ ఉన్నచోట అభేట్ మందును పిచికారీ చేస్తున్నట్లు చెప్పారు. దోమల నిర్మూలనకు ఫాగింగ్ కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులకు సూచించామని, ఇన్ని చర్యలు తీసుకున్నప్పటికీ ఆ ప్రాంతంలో మలేరియా కేసు వస్తే కనుక ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. ఆ ప్రాంతంలో మలాథియన్ పైరత్నం స్ప్రే చేయాలని, ఆ ప్రాంతం నందు ఫీవర్ సర్వే తో పాటు జ్వరం వచ్చిన ప్రతి వ్యక్తి రక్త పూతలు సేకరించాలని, మలేరియా నిర్ధారణ చేయాలని తీర్మానించినట్లు వివరించారు.

జిల్లాలో తాము శాఖాపరంగా సమర్ధవంతంగా చేపట్టిన కార్యక్రమాల నేపథ్యంలో మలేరియా రహిత పల్నాడు జిల్లాగా నిలిపామన్నారు. గత నెల 7 తేదీన ఓటు హక్కు వినియోగించుకునేందుకు యడ్లపాడు మండలంలోని ఒక స్పిన్నింగ్ మిల్లు నుండి శ్రీకాకుళం వెళ్ళి వచ్చిన ఇద్దరు యువకులలో మలేరియా లక్షణాలు గుర్తించినట్లు తెలిపారు. వారితో పాటు స్పిన్నింగ్ మిల్లులో పని చేస్తున్న పలువురు నుండి రక్త నమూనాలు సేకరించి పరీక్షలు జరిపామని, ఎటువంటి కేసులు నమోదు కాలేదని చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రతి శుక్రవారం డ్రై డే ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వలు లేకుండా చేయడం దోమల లార్వాలను నిర్మూలించామన్నారు. మలేరియా నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని కమిటీ సభ్యులకు సూచించినట్లు చెప్పారు.



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

ఇళ్ల నిర్మాణాలు కొనసాగేనా?

- ప్రభుత్వం మారనుండంతో లబ్ధిదారుల్లో ఆందోళన
- భూమి కొనుగోలులో అవినీతి ఆరోపణలు
- కొన్ని నెలలుగా కన్నెత్తి చూడని అధికారులు
- పనిచేయని బోర్లు.. విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-వినుకొండ

కొన్ని రోజుల్లో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువు తీరనుంది. గత ప్రభుత్వం ప్రారంభించిన జగనన్న కాలనీల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 30 లక్షల మంది లబ్ధిదారులకు సెంటు చొప్పున నివేశనా స్థలాలు పంపిణీ చేశారు. దీనిలో భాగంగా వినుకొండ పట్టణంలోని ఇల్లు లేని పేదలకు సుమారు 6,500 ఇళ్ల పట్టాలు మంజూరు అయ్యాయి. ఇప్పటికి 1500కు పైగా గృహాలు పూర్తి కాగా, మరో 500 గృహాలు నిర్మాణ దశల్లోనే ఉన్నాయి.



ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ నేపథ్యంలో కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారులు నిర్మాణాలు కొనసాగుతాయా లేక నిలిచిపోతాయా అన్న ఆందోళనలో అన్నారు. లబ్ధిదారుల్లో అధిక శాతం మంది టిడిపి కూటమికి మద్దతు తెలిపినట్లు సమాచారం. ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతాయని, అంతర్గత సిసి రోడ్లు, డ్రైన్లు మౌలిక వసతులు కల్పిస్తామని కూటమి అభ్యర్థిగా విజయం సాధించిన జివి ఆంజనేయులు వారికి హామీ ఇచ్చారు. అయితే, గత ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల పట్టాల్లో నిర్మాణాలు కొనసాగుతాయా లేక టిడ్కో ఇళ్ల మాదిరిగా నిలిచిపోతాయా అన్న ఆందోళన వ్యక్తమౌతోంది. వినుకొండలోని పేదలకు ఇళ్ల స్థలాలు అందజేసేందుకు గత



ప్రభుత్వం బ్రాహ్మణపల్లి రెవిన్యూ పరిధి జాలలపాలెం గ్రామం వద్ద 120 ఎకరాల భూమిని ప్రభుత్వం కొనుగోలు చేసి ఒక్కొక్క లబ్ధిదారునికి సెంటు చొప్పున నివేశనా స్థలాలు అందజేసింది. కానీ ల్యాండ్ ఎక్విజేషన్లో అవినీతి చోటుచేసుకుందన్న ఆరోపణలు గత నాలుగేళ్లగా వినిపిస్తూనే ఉన్నాయి. ఎకరం 18 లక్షలు చొప్పున 120 ఎకరాలను బొల్లా బ్రహ్మానాయుడు వద్ద నుండి ప్రభుత్వం



కొనుగోలు చేసిన దాంట్లో.. ప్రభుత్వ భూమి ఉందని, దానిని ప్రభుత్వానికే విక్రయించి కోట్లు కాజేశారనే ఆరోపణలు ఉన్నాయి. భూమి కొనుగోలులో జరిగిన అవినీతిపై నూతన ప్రభుత్వం విచారణ చేపడుతుందనే వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు కొనసాగుతాయా లేక నిలిచిపోతాయోనని లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

కాలనీల్లో పలు సమస్యలు

ప్రస్తుతం జగనన్న కాలనీల్లో పలు సమస్యలు లబ్ధిదారులు ఎదుర్కొంటున్నారు. కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పాటు, కాలనీలోని బోర్లు అధిక శాతం రిపేర్లు రావడంతో నీటి సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. అధికారులు సైతం పట్టించుకోకపోవడంతో కాలనీలో ఇళ్ల నిర్మాణాలు మొక్కుబడిగా జరుగుతున్నాయి. కాలనీ రాకపోకలకు ప్రధాన రహదారి కూడా నిర్మాణం చేపట్టకపోవడంతో రానున్న వర్షాకాలంలో రాకపోకలకు మరింత ఇబ్బంది తలెత్తుతుంది. అదేవిధంగా కాలనీలో బయట వ్యక్తులు ఇష్టానుసారంగా సంచరిస్తూ కాలనీలోని బోర్లు, లబ్ధిదారుల గహాల్లోని పనిముట్లు ఇతర వస్తువులను దొంగిలిస్తున్నడంత లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. గతంలో పలు పర్యాయాలు అధికారులకు విన్నవించిన ఫలితం లేకపోవడంతో స్థానిక సమస్యలు పరిష్కారం అవడం లేదని ఇలా అయితే ఇల్లు లేని నిరుపేదలైన తమకు అద్దెలు కట్టే స్తోమత కూడా లేదని నూతన ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయాలు తీసుకొని కాలనీలో సౌకర్యాలు కల్పనకు కృషి చేయాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.

జన్యుపరంగానూ కేన్సర్ వచ్చే అవకాశం

ప్రజాశక్తి-గుంటూరు

కేన్సర్‌కు కారణాలు, అందుబాటులో ఉన్న చికిత్స విధానాల గురించి స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో ఆదివారం జరిగిన ఆరోగ్య సభలో డాక్టర్ ఎ.సత్యశ్రీనివాస్ వివరించారు. ప్రస్తుతం సమాజంలో కేన్సర్ వ్యాధి విస్తృతంగా వ్యాపించిందని, దీనికి జన్యుపరమైన కారణాలు, మనం అనుసరిస్తున్న జీవనశైలి ముఖ్య కారణాలని అన్నారు. కొంతమందిలో ఏవిధమైన చెడు వ్యసనాలూ లేకున్నా వారికి జన్యుపరంగా కేన్సర్ వచ్చే అవకాశాలు ఉంటాయని తెలిపారు. చాలామందిలో ధూమపానం, మద్యపానం, ప్యాసివ్‌స్మోకింగ్, వివిధ రకాల రసాయనాలతో పండించిన కూరగాయలను, పండ్లను వినియోగించటం, వివిధ ఆహార పదార్థాల్లో రుచుల కోసం ఉపయోగించే అజానామోటా లాంటి పదార్థాలను వివిధ ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనపడటానికి ఉపయోగించే కలర్స్, కెమికల్స్ కలిపి తయారుచేసిన ఆహారం ఉత్పత్తులను తినడం ద్వారా కేన్సర్ బారిన పడుతున్నారని వివరించారు. కేన్సర్‌ను తొలి దశలో గుర్తిస్తే వందశాతం నయం చేయటానికి చికిత్సలు అందుబాటులో ఉన్నాయని, అలా కాకుండా అడ్వాన్స్ దశలో గుర్తిస్తే నయం చేయటం కష్టమవుతోందని చెప్పారు. అయితే బాధితుల జీవిత కాలాన్ని పొడిగించే అవకాశం ఉందన్నారు. రెండు భాగాలకు సంబంధించిన కేన్సర్లకు వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయని, అవి ఒకటి రంగుకు సంబంధించిన హెపటైటిస్‌బి వ్యాక్సిన్, రెండవది సర్వైకల్ కేన్సర్‌కు సంబంధించిన వ్యాక్సిన్ అని తెలిపారు. ఈ రెండు రకాలకు తప్ప మన శరీరంలో వివిధ భాగాలకు సంభవించే కేన్సర్లకు వ్యాక్సిన్ లేదని, వాటి విషయంలో స్క్రీనింగ్ టెస్ట్‌ల ద్వారా కొన్ని సందర్భాల్లో తొలి దశలో గుర్తించవచ్చని చెప్పారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లలో వందశాతం తెలిసే అవకాశం ఉండదని, జనరల్ చెకప్‌లలో ఏదైనా కేన్సర్‌కు సంబంధించిన లక్షణాలు కనపిస్తే తదుపరి పరీక్షలు పెట్‌స్కాన్, బయాప్సీ లాంటి పరీక్షల ద్వారా కేన్సర్‌ను నిర్ధారించి వైద్యం చేసే అవకాశం ఉంటుందని అన్నారు. ఒకసారి కేన్సర్‌ను నిర్ధారించిన తర్వాత దాని స్థితి, అది ఏ కోవకు చెందిన కేన్సరో పరిశీలించి ఏ రకమైన వైద్యం చేయాలని వైద్యులు నిర్ణయిస్తారని చెప్పారు. సాధారణంగా సర్జరీ, రేడియో థెరపీ, కీమోథెరపీ ప్రస్తుతం అనుసరిస్తున్న వైద్య విధానాలను, వీటిలో సర్జరీకి, రేడియో థెరపీకి పెద్దగా దుష్పరిణామాలు ఉండవని, హీమోథెరపీలో మాత్రం కొన్ని సైడ్‌ఎఫెక్ట్స్ కనబడతాయని, అవి కూడా శాశ్వతంగా ఉండేవి కాదని తెలిపారు. కేన్సర్ తల నుండి పాదాల వరకు మనం గమనిస్తే చర్మానికి, నోటికి, గొంతుకి, ఊపిరితిత్తులకి, బ్లడ్, ప్రోస్టేటిస్ గ్రంధికి, పొట్టలో, పేగుల్లో, మహిళలకు అండాశములలో, సర్వైకల్‌లో, రొమ్ములలో కూడా వచ్చే అవకాశం ఉన్నాయని వివరించారు. బాగా కాగిన నూనెలో వేయించిన ఆహారం తీసుకోవద్దని, ధూమపానం మానేయాలని, మద్యపానం అదుపులో ఉంచుకోవాలని, ప్రాసెస్ చేసిన ఆహారం, ప్యాకెట్ ఫుడ్, ఆఫ్ బాయిల్డ్ మాంసం, రెడ్ మీట్ లాంటివి తీసుకోవద్దని సూచించారు. అనంతరం అవగాహన సభ్యులు డాక్టర్‌ను ఘనంగా సత్కరించారు. సమావేశానికి కో-ఆర్డినేటర్‌గా టీవీ సాయిరాం వ్యవహరించగా, అవగాహన సీనియర్ సభ్యులు కె.చంద్రశేఖరరావు, ఎ.రవీంద్రకుమార్, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి పాల్గొన్నారు.

ఆరోగ్య సభలో డాక్టర్ ఎ.సత్యశ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ సత్యశ్రీనివాస్



రామోజీరావుకు జర్నలిస్టుల నివాళి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

పత్రికా రంగంలో చెరగని ముద్రవేసిన ఈనాడు సంస్థల అధినేత రామోజీరావు మరణం అత్యంత బాధాకరమని జర్నలిస్టు మిత్రులు పేర్కొన్నారు. ఏపీయూడబ్ల్యుజే గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు ఎస్‌ఎన్ మీరా అధ్యక్షతన బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఒ కార్యాలయంలో రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ సామాన్య కుటుంబంలో జన్మించి, పత్రిక, మీడియా వివిధ రంగాల్లో తనదైన శైలిలో అసమాన్య విజయాలను రామోజీరావు సాధించారని అన్నారు. ఎందరో జర్నలిస్టులకు మార్గదర్శకులైన రామోజీరావు జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. కార్యక్రమంలో ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షులు ఏచూరి శివ, ఐజేయు సభ్యులు ఓ.మార్కండేయులు, సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షులు సునీల్ సందీప్, ఉపాధ్యక్షులు జొన్న రాజేష్, కోశాధికారి ఫణీంద్ర కుమార్, డాక్టర్ సేవకుమార్, పటాన్ ఆసిఫ్‌ఖాన్, షేక్ రాజా సాహెబ్. పి.శ్రీనివాసరావు, షేక్ మొగలయ్య, ఎస్ఎమ్‌డి షరీఫ్, పరస్యం నాయక్, కోడిరెక్క కోటిరత్నం, ఎం.సుబ్బారావు, బి.సాంబశివరావు, ఎస్.జీవన్, లూర్థు రాజు, చెరుకూరి సుబ్బారావు, రామకృష్ణారెడ్డి, రాంప్రసాద్, వాసు పాల్గొన్నారు.

అమెరికాలోని డల్లాస్‌లో కాకతీయ సేవాసమితి ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. రామోజీరావు చిత్రపటానికి పలువురు ఎన్ఆర్ఐలు పూలమాలలేసి నివాళులర్పించారు.



మహిళల సాధికారతకు ప్రాధాన్యం : ఎమ్మెల్యే మాధవి

మహిళల ఆధ్వర్యంలో విజయోత్సవం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మహిళా సాధికారత టిడిపితో సాధ్యమని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే డాక్టర్ గళ్లా మాధవి అన్నారు. ఆమె ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో ఎన్నికైన సందర్భంగా ఆదివారం నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాలులో మహిళలు విజయోత్సవ సభ నిర్వహించారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ చంద్రబాబు హయాంలో మహిళా సాధికారితకు పెద్దపీట వేశారని, అన్నిరంగాల్లో 33 శాతం రిజర్వేషన్లు పాటించారని చెప్పారు. ఐటి రంగంలో మహిళలు దూసుకువెళ్లడానికి చంద్రబాబు తీసుకున్న సంస్కరణలే కారణమన్నారు. రాజకీయాల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించి, మద్యపానం నిషేధం అమలు చేశారన్నారు. ఎన్టీఆర్ హయాంలో ఆస్తిలో సమాన హక్కు కల్పించారని చెప్పారు. మహిళల ఆర్థిక స్వావలంబనతో పాటు మహిళా కమిషన్ తీసుకొచ్చారని అన్నారు. తాజాగా భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో మహాశక్తి కార్యక్రమాన్ని తీసుకురావడం చారిత్రక నిర్ణయమన్నారు.


అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ గళ్లా మాధవి

డ్రెయినేజి కాల్వల ప్రక్షాళన ప్రారంభం

ప్రజాశక్తి-తెనాలి

ఇటీవల ఎమ్మెల్యేగా ఎన్నికైన నాదెండ్ల మనోహర్ సమస్యలపై దృష్టి సారించారు. రెండ్రోజుల క్రితం మున్సిపల్ అధికారులతో సమీక్షించిన నేపథ్యంలో మున్సిపల్ అధికారులు మురుగునీటి పారుదల సమస్యలను గుర్తించి ఆదివారం గురవయ్య కాలనీ శివారు, పాలాద్రి కాల్వలో వ్యర్థాల తొలగింపు చేపట్టారు. తొలగింపు ప్రక్రియలను పరిశీలించిన మనోహర్ మాట్లాడుతూ కాల్వల్లో వ్యర్థాలు పేరుకుపోవటంతో కొద్దిపాటి వర్షానికి కూడా వర్షపునీరు రోడ్డుపై నిలిచిపోతుందని, ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. 15 రోజుల వ్యవధిలో మురుగు కాల్వల పారుదల సరళీకృతం చేయిస్తామన్నారు. డ్రెయినేజ్, ఇరిగేషన్ అధికారులతో సమీక్షించి మరింత ప్రక్షాళనకు అడుగులు వేస్తామన్నారు. ఆయన వెంట కమిషనర్ బి.శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ అనూష, డిఈలు ఆర్.సుబ్బారావు, కె.నాగభూషణం, ఏఈ రాజాఫణీంద్ర, నాయకులు హరిదాసు గౌనీశంకర్, ఈదర పూర్ణచంద్, బెల్లపు యశ్వంత్, పసుపులేటి మురళీకృష్ణ పాల్గొన్నారు.


కాల్వల పూడిక తీతను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మనోహర్


పోతినేని శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు చెబుతున్న సుందర్‌రావు యాదవ్ తదితరులు

పోతినేని శ్రీనివాసరావుకు పలువురు నాయకుల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - మంగళగిరి

ఎమ్మెల్యేగా నారా లోకేష్ గెలుపుతోపాటు ర్యాష్ట్రంగా కూటమి విజయం సాధించిన సందర్భంగా టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాస్‌రావు స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో పలువురు నాయకులు ఆదివారం కలిసి శుభాకాంక్షలు తెలిపి తమ హర్షం వ్యక్తం చేశారు. వీరిలో రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి దానబోయిన సుందర్‌రావు యాదవ్, మంగళగిరి రైతు సంఘం ప్రధాన కార్యదర్శి తోట సాంబయ్య, మంగళగిరి రూరల్ పార్టీ కార్యదర్శి చింకా కోటేశ్వరరావు, ఆలా వెంకట నారాయణ, మంగళగిరి నియోజకవర్గం బీసీ సెల్ కన్వీనర్ దానబోయిన శంకరావు, గోడితల చంద్రమౌళి, కటకం వాసు, బత్తుల శ్రీనివాసరావు, తోట సురేష్, గొల్లపూడి యేసుబాబు, తెల్లమేకల వీరరాఘవులు, దానబోయిన కోటేశ్వరరావు ఉన్నారు.


కేకును కట్ చేస్తున్న చిల్లపల్లి శ్రీనివాసరావు తదితరులు

జనసేన సంబరాలు

ప్రజాశక్తి - మంగళగిరి

జనసేన అధినేత పవన్ కల్యాణ్ పిఠాపురంలో, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మంగళగిరిలో ఎమ్మెల్యేలుగా గెలిచిన సందర్భంగా జనసేన పార్టీ మంగళగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చిల్లపల్లి శ్రీనివాసరావు నివాసం వద్ద ఆదివారం సంబరాలు చేసుకున్నారు. మండలంలోని కాజా గ్రామ నాయకుల కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

కాపు, బలిజ సంక్షేమ సేన నియోజకవర్గం అధ్యక్షులు, జనసేన నాయకులు తిరుమలశెట్టి కొండలరావు ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జనసేన కార్యాలయంలో విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి, జనసేన అధినేత పవన్ కల్యాణ్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మంగళగిరి నియోజకవర్గంలో అత్యధికంగా కాపులు ఉన్నందున కాపులకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవి ఇవ్వాలని, నామినేటెడ్ పోస్టులో కాపులకు న్యాయం చేయాలని నాయకులు కోరారు. ఆర్.రమేష్, సిహెచ్.నాగరాజు, ఎ.సత్యనారాయణ, ఎ.రమేష్, డి.శివనాగేంద్రం పాల్గొన్నారు.

దాడికి యత్నించారని పులి చిన్నా ఫిర్యాదు

ప్రజాశక్తి - తుళ్లూరు



మాజీ ఎంపి నందిగం సురేష్, అతని కుటుంబ సభ్యులు, అనుచరులు తనపై దాడికి యత్నించారని, రక్షణ కల్పించాలని అమరావతి దళిత జెఎసి, టిడిపి నాయకులు పులి చిన్నా ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శనివారం రాత్రి వేరే ఊరి నుంచి ఉద్దండరాయునిపాలెంలోని తన ఇంటికి వచ్చిన సమయంలో సురేష్ కుటుంబ సభ్యులు, అనుచరులు దాడికి వచ్చారని, తనకు రక్షణ కల్పించాలని సిఐ సుభానికి విజ్ఞప్తి చేశారు.



ఉత్తమ ర్యాంకర్లకు నగదు ప్రోత్సాహకంగా చెక్కు అందజేస్తున్న భాష్యం రామకృష్ణ తదితరులు

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో సత్తా చాటిన భాష్యం

ప్రజాశక్తి-గుంటూరు

జేఈఈ అడ్వాన్స్-2024 ఫలితాల్లో భాష్యం ఐఐటి జేఈఈ అకాడమీ ఆలిండియా అత్యుత్తమ ర్యాంకులతో సంచలనం సృష్టించిందని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆదివారం రామకృష్ణ అభినందించారు. ఐఐటి జెఇఇ అకాడమీ విద్యార్థులు ఎం.సాయియశ్వంత్‌రెడ్డి ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 50వ ర్యాంకు, ఎం.జిష్ణుసాయి ఓపెన్ కేటగిరీలో ఆలిండియా 62వ ర్యాంకు సాధించి జాతీయ స్థాయిలో విజయకేతనం ఎగురవేశారని అన్నారు. వివిధ కేటగిరీలలో ఎం.సాయిశ్వంత్‌రెడ్డి 5వ ర్యాంకు, పి.గౌతమి 19వ ర్యాంకు, కె.శ్రేయ 23వ ర్యాంకు, కె.జాషువా వివేక్ 26వ ర్యాంకు, జి.జాన్ 36వ ర్యాంకు, ఎం.అర్జున్‌కుమార్ 37వ ర్యాంకు, కె.హర్షిత 43వ ర్యాంకు, కె.చైతన్య 52వ ర్యాంకు, పి.శ్యామ్ 61వ ర్యాంకు, డి.భరత్‌చంద్ర 86వ ర్యాంకుతోపాటు ఆలిండియా వందలోపు 12 ర్యాంకులు, 200లోపు 20 ర్యాంకులు, 500 లోపు 51 ర్యాంకులు, వెయ్యిలోపు 86 ర్యాంకులు, రెండు వేల లోపు 107 ర్యాంకులు, ఐదువేల లోపు 193 ర్యాంకులతోపాటు ఐఐటి సెలక్షన్స్‌లో ఆలిండియా ఆల్‌టైం ది బెస్ట్‌గా నిలిచిందని చెప్పారు. అన్ని పోటీ పరీక్షా ఫలితాల్లో ఆల్‌రౌండర్స్‌గా నిలుస్తున్న భాష్యం ఐఐటి అకాడమీ విద్యార్థులను చూస్తే గర్వంగా ఉందని, ఈ అద్భుత ఫలితాలను పక్కా ప్రణాళికలతో కూడిన తమ భాష్యం ఐఐటి ఫౌండేషన్ కరిక్యులమే ముఖ్యకారణమని అన్నారు. ఈ సందర్భంగా సాయియశ్వంత్‌రెడ్డి, జిష్ణుసాయికి ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున ఉన్నత చదువుల నిమిత్తం నగదు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి విద్యార్థులను భాష్యం విద్యా సంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు అభినందించారు.

రసాబాసగా పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఎన్నిక

ఏకగ్రీవమంటున్న నూతన కమిటీ - చెల్లదంటున్న పాత కార్యవర్గంలోని కొందరు



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

ప్రజాశక్తి-తెనాలి

పట్టణ రంగస్థల కళాకారుల సంఘం ఎన్నిక ఆదివారం స్థానిక బుర్రిపాలెం రోడ్డు బిసి కాలనీలోని సంఘ కార్యాలయంలో జరిగింది. ఎన్నికల అధికారిగా కాకతీయ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ డిఎల్ కాంతారావు వ్యవహరించారు. ప్రస్తుత పాలకవర్గం ఐదేళ్ల కాలపరిమితి పూర్తి కావటంతో ఎన్నిక జరిగిందని నూతన కమిటీ చెబుతోంది. ఇప్పటి వరకూ సంఘం కార్యదర్శిగా కొనసాగిన జి.సుబ్బారావు తొలుత జరిగిన సమావేశానికి అధ్యక్షత వహించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్ష, కార్యదర్శులుగా బుర్రా విజయలక్ష్మి, ఆరాధ్యుల అదినారాయణరావు, గౌరవాధ్యక్షులుగా ఆరాధ్యుల కోటేశ్వరరావు, కార్యనిర్వాహక అధ్యక్షులుగా జ.సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎం.రామలింగేశ్వరరావు, కోశాధికారిగా దీపాల సుబ్రహ్మణ్యం, ఉపాధ్యక్షులుగా బి.నాగమణి, నిర్మాలా రమేష్, పి.సుబ్బారావు, శరత్‌వెంకయ్య, ఎం.లక్ష్మీతులసి, సంయుక్త కార్యదర్శులుగా కె.మధుకర్, జి.సుధీర్, ఎం.సుభాని, కార్యవర్గ సభ్యులుగా బడుగు మోహనరావు, జి.సుబ్రహ్మణ్యం, కె.రమేష్, ఎస్‌కె సైదా, వి.సత్యవతి, క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా బుర్రా సాయిమాధవ్, సిహెచ్ సింగారావు, ఎస్‌కె జానిబాషా, న్యాయ సలహాదారుగా హరిదాసు గౌరీశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతక కమిటీ ప్రమాణ స్వీకారం కూడా జరిగింది. ఎన్నిక ప్రక్రియలో అప్పుడే అధికార పార్టీ నాయకులమంటూ కొందరు వ్యక్తులు కూడా జోక్యం చేసుకున్నట్లు పాత కమిటీ ఆరోపిస్తోంది. కార్యక్రమంలో పలువురు కళాకారులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నిక నిబంధనలకు పూర్తి విరుద్ధం

ఆరాధ్యుల కన్నా, ఉపాధ్యక్షులు, పాత కమిటీ

ఈ ఎన్నిక పూర్తిగా నిబంధనలకు విరుద్ధం. కేవలం సర్వసభ్య సమావేశంగా సమాచారమిచ్చారు. సమావేశానికి హాజరైతే అప్పటికప్పుడు ఎన్నికని చెప్పారు. వాస్తవానికి సంఘంలో దాదాపు 1100 మందికి పైగా సభ్యులున్నారు. వారిలో కనీసం కోరానికి సరిపడా సభ్యులు కూడా హాజరు కాలేదు. కేవలం 200 మందితో వారికి అనుకూలంగా కమిటీ ప్రకటించుకున్నారు. పాత పాలకవర్గం కాలపరిమితి ఆదివారం వరకూ ఉంది. ఆ పాలకవర్గం తమ పదవీకాలం ముగిసిన వెంటనే సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి, జమాఖర్చులు వెల్లడించిన తర్వాత అధ్యక్షుల అనుమతితో ఎన్నిక జరగాలి. సభ్యులకు పూర్తిస్థాయి సమాచారం లేకుండా, అధ్యక్షులు అందుబాటులో లేకుండా, జమాఖర్చుల లెక్క తేల్చకుండా ఏకపక్షంగా కమిటీ ప్రకటించుకోవటం సరికాదు.

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో దుర్గాప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి-గుంటూరు

జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ తెలిపారు. గుంటూరు జోన్‌కు చెందిన శ్రీచైతన్య విద్యార్థులు అన్ని కేటగిరీల్లో కలిపి కె.సుమంత్‌రెడ్డి 44వ ర్యాంకు, పి.పవన్‌కుమార్ 88వ ర్యాంకు, బి.అనిల్ నాయక్ 129వ ర్యాంకు, డి.వైశాలి 155వ ర్యాంకు, కె.లోకేష్ 185వ ర్యాంకు, జి.బిల్విక 318వ ర్యాంకు, పి.జ్యోతిక 423వ ర్యాంకు, కె.తేజవర్ధన్ 591వ ర్యాంకు, కె.విష్ణుసాయినాథ్ 620వ ర్యాంకు, ఇంకా వెయ్యిలోపు 20 మంది, రెండువేలలోపు 32 మంది, ఐదువేలలోపు 62 మంది, పది వేలలోపు 121 మంది సాధించారని వివరించారు. ఈ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అకడమిక్ డైరెక్టర్ బొప్పన సుష్మ, ఎగ్జిక్యూటివ్ ఎజిఎం దుర్గాప్రసాద్, డీన్‌లు కిషోర్‌కుమార్, చంద్రశేఖర్, అసోసియేట్ డీన్ హరిబాబు, ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం అభినందించారు.

డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ నేపథ్యం

పేరు	**: డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్**
తల్లి దండ్రుల పేర్లు	**: సువర్చల, సాంబశివరావు**
స్వగ్రామం :	**బుర్రిపాలెం గ్రామం, తెనాలి మండలం , గుంటూరు జిల్లా**
పుట్టిన తేదీ :	**07.03.1976**
విద్యార్హతలు :	**ఎమ్‌డి (జనరల్ మెడిసిన్)**
భార్య పేరు	**: డాక్టర్ శ్రీరత్న**
సోదరుడు	**: రవిశంకర్**
సంతానం	**: ఒక కుమారుడు, ఒక కుమార్తె**

కుటుంబ నేపథ్యం : స్వగ్రామమైన బుర్రిపాలెంలో రైతు కుటుంబం. తండ్రి సాంబశివరావు వ్యాపార రీత్యా బుర్రిపాలెం నుండి ఒకప్పటి గుంటూరు జిల్లా, ప్రస్తుతం పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటకు వెళ్లి స్థిరపడ్డారు. నర్సారావుపేట వాసులకు ఆయన రాజకీయంగా సుపరిచితుడే. టిడిపి స్థాపించిన నాటినుండి రెండు దశాబ్దాలు పాటు పార్టీకి విశిష్ట సేవలందించారు. డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తన పదవ తరగతి వరకు నరసరావుపేట మున్సిపల్ స్కూల్‌లోను, ఇంటర్మీడియట్ గుంటూరులోను పూర్తి చేశారు. ప్రభుత్వ ఉన్నతపాఠశాలలో, తెలుగు మీడియంలో చదివినప్పటికి ఆయన పట్టుదలతో చదివి 1993-94 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి 60 వేల మంది విద్యార్థులు ఎంసెట్ పరీక్షకు హాజరు కాగా రాష్ట్రస్థాయిలో ఆయన 27వ ర్యాంకు సాధించి ఉస్మానియా మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. తదనంతరం ఉన్నత చదువులు కోసం అమెరికా వెళ్లిన ఆయన మెడికల్ పీజీ, ఇంటర్నల్ మెడిసిన్ లను

బుర్రిపాలెం టు ఢిల్లీ!

పెన్సిల్వేనియా రాష్ట్రంలోని గైసింగర్ వైద్య కేంద్రం నుండి పూర్తి చేయడమే కాకుండా అక్కడ కూడా అత్యధిక మార్కులు సంపాదించి తన ప్రతిభను మరోసారి చాటుకున్నారు. పీజీ శిక్షణా సమయంలో సైతం అమెరికా దేశంలో జరిగే వైద్య విద్య విజ్ఞానపు పోటీల్లో పెన్సిల్వేనియా రాష్ట్రం తరపున పాల్గొన్న అయన వరుసగా రెండుసార్లు అవార్డులు అందుకున్నారు.

తదనంతరం జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీలోని సినాయి హాస్పిటల్‌లో ఐదేళ్లపాటు విద్యార్థులకు వైద్య విద్య బోధకుడుగాను ఫిజీషియన్‌గాను సేవలందించారు. ఇతర దేశాల నుండి అమెరికాలో వైద్యులుగా పని చేసేందుకు వెళ్లేవారు యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ పరీక్షలు పూర్తి చేయాల్సి ఉంటుంది. అమెరికా యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జాం (యుఎస్ఎంఎల్ఈ) పూర్తి చేసేందుకు వెళ్ళిన అయన సరైన వసతుల్లేక, తగిన శిక్షణ లభించక అనేక వ్యయప్రయాసలకు లోనయ్యారు. నాటి లెక్కల ప్రకారం శిక్షణా ఖర్చే 5 వేల డాలర్లు. ఈ పరీక్షలు పూర్తి చేయడంలో వైద్యులు ఎదుర్కొంటున్న అనేక సవాళ్లైన వసతి భారం, శిక్షణలో నాణ్యతా లోపం, భారీగా శిక్షణా వ్యయంవంటి స్వీయ అనుభవాలను దష్టిలో పెట్టుకుని అయన తన 25 ఏళ్లప్పుడు 2001లో వైద్య విద్యార్థులు ఎవరూ తనలా ఇబ్బందులు ఎదుర్కొకూడదని భావించి తన శిక్షణలో భాగంగా తాను రూపొందించుకొన్న నోట్స్ సాయంతో 250 ప్రశ్నలతో ఒక పుస్తకాన్ని రాశారు. దీని ప్రచురణకు అమెరికాలోని ముద్రణాలయాలను సంప్రదించినప్పటికీ వారు ముందుకు రాలేదు. అమెరికాలో సాఫ్ట్వేర్ రంగం వేళ్లానుకొంటున్న తరుణంలో తన సతీమణి డాక్టర్ శ్రీరత్న, సాఫ్ట్వేర్ నిపుణులు అయిన కుటుంబ సభ్యులైన రవిశంకర్, కోనేరు శ్రీకాంత్ సహకారంతో తన పుస్తకాన్ని ఇంటర్‌నెట్‌లో ఉంచారు. దీని ధర కేవలం 20 డాలర్లుగానే నిర్ణయించారు. ఈ పుస్తకానికి వైద్యవిద్యా రంగం నుండి అపూర్వమైన స్పందన లభించింది. ఆ ప్రేరణతోనే ఆయన వైద్య విద్యార్థుల కోసం అమెరికాలో లైసెన్సింగ్ ఎగ్జామ్స్‌కు హాజరయ్యే విద్యార్థులకు స్వల్ప రుసుముతో అత్యంత నైపుణ్యంతో కలిగిన, అనుభవజ్ఞులైన, అంకితభావంతో కూడిన బోధనా సిబ్బందితో కలిసి తాను ఫౌండర్, సీఈఓగా 'యూ వరల్డ్' పేరుతో సంస్థను స్థాపించి ఆన్లైన్ శిక్షణ ఇస్తున్నారు. అమెరికాలో మంచి ఖ్యాతి గడించిన తన సంస్థ ద్వారా ఆయనక అనేక మందికి ఉపాధి కూడా కల్పించారు. ప్రస్తుతం ఈ సంస్థ వైద్యం, నర్సింగ్, ఫార్మసీ, న్యాయవాదం, వాణిజ్యం ,అకౌంటింగ్ విభాగాల్లో లైసెన్సింగ్ పరీక్షలకు శిక్షణను అందిస్తోంది. 48 ఏళ్ల పెమ్మసాని యూ వరల్డ్ సంస్థ వ్యవస్థాపకుడు. ఈ సంస్థ సిఈవో కూడా ఆయనే. దీంతో పాటు టీడీపీ ఎన్నారై సెల్‌లో కూడా యాక్టివ్‌గా ఉన్నారు.

పెమ్మసాని చంద్రశేఖర్ 2020లో యుఎస్‌లో యువ పారిశ్రామికవేత్తగా ఎర్నెస్ట్, యంగ్ అవార్డును గెలుచుకున్నారు. పెమ్మసాని ఫౌండేషన్‌ని కూడా



స్థాపించారు. ఎన్నికల అఫిడవిట్ల ప్రకారం, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేస్తున్న 8,360 మంది అభ్యర్థుల్లో పెమ్మసాని అత్యధిక ఆస్తులు కలిగి ఉన్నారు. రూ.5780 కోట్ల ఆస్తులున్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. ఇటీవల ఎన్నికల్లో గుంటూరు లోక్‌సభ నుంచి ఆయన తన సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి కిలారి రోశయ్యపై 3,44,695 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. రాజకీయ రంగ ప్రవేశం చేసిన కొద్ది రోజులకే ఆయన గుంటూరు నుంచి పోటీ చేసి భారీ ఆధిక్యతతో గెలిచారు. కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు.